ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా వార్తలు
శనివారం 2 ఆగస్టు 2025 | 3







అమలాపురంలో పింఛన్ పంపిణీ చేస్తున్న కలెక్టర్

జిల్లాలో 90.79 శాతం పింఛన్లు పంపిణీ

పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

అమలాపురం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా ద్వారా అందిస్తున్న సామాజిక పింఛన్లు పేదలకు భద్రతతోపాటు గౌరవప్రదమైన జీవితం గడపడానికి భరోసా ఏర్పడుతుందని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని 30వ వార్డులో శుక్రవారం పింఛన్లను కలెక్టర్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన గ్రామ, వార్డు, సచివాలయ కార్యదర్శులు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు. ఆ వార్డులో లబ్ధిదారులకు పింఛన్లు ఏవిధంగా అందుతున్నాయనే దానిపై కలెక్టర్ ఆరా తీశారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారులకు అందించి వారి సంక్షేమ అభివృద్ధి కార్యక్రమంలో ఉద్యోగులు భాగస్వాములై లబ్ధిదారుల సంతృప్తి స్థాయిలను పెంచాలని సూచించారు. కమిషనర్ నిర్మల్‌కుమార్ మున్సిపల్ పరిధిలో జరుగుతున్న పింఛన్ల పంపిణీ తీరును కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో డీఆర్డీఏ పీడీ సాయినాథ్‌జైచంద్రగాంధీ, వార్డు కౌన్సిలర్ యన్నాబత్తుల పద్మ, మున్సిపల్ డీఈ సత్యనారాయణ పాల్గొన్నారు. కాగా జిల్లావ్యాప్తంగా సాయంత్రానికి 90.79 శాతం పింఛన్లను పంపిణీ చేశారు. ఇందులో కొత్తగా మంజూరైన 4,315 స్పౌజ్ పింఛన్లు కూడా ఉన్నాయి.



ఆహాకీ!

ఆహా.. అనేలా హాకీ జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి.. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 జట్లతో మార్చ్‌ఫాస్ట్, పరేడ్ ఘనంగా నిర్వహించారు. కలెక్టర్ షాన్‌మోహన్, ఎమ్మెల్యేలు చినరాజప్ప, పంతం నానాజీ, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ తదితరులు పోటీల ప్రారంభ సూచికగా బెలూన్లను గాలిలోకి ఎగురవేశారు. 12 రోజుల పాటు జరిగే పోటీల్లో ఇబ్బందులు తలెత్తకుండా వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. పోటీలు మొదలయ్యాయి..

మరో అవరోధం!

- వశిష్ఠ నదిలో దిండి వైపు కుంగిన పీ6 పిల్లర్
- దిండి - చించినాడ మధ్య రైల్వే వంతెన నిర్మాణంలో అవరోధం
- పిల్లర్‌ను సరిచేసే సాంకేతిక పరిజ్ఞానంతో నిర్మించేందుకు ఏర్పాట్లు
- దిండి-చించినాడ మధ్య 19 పిల్లర్స్ నిర్మాణం పూర్తి
- త్వరితగతిన పిల్లర్ నిర్మించాలని కోనసీమ ప్రజల డిమాండ్







వశిష్ఠ గోదావరి నదిపై దిండి వైపు కుంగిన పీ6 రైల్వే పిల్లర్ దృశ్యాలు

(అమలాపురం-ఆంధ్రజ్యోతి)

అత్యంత వేగంతో పరవళ్లు తొక్కే వశిష్ఠ గోదావరి నదిపై నిర్మాణాలు చేపట్టాలంటే కాంట్రాక్టు సంస్థలకు పెద్ద సవాలే. సముద్రం, గోదావరి సంగమ ప్రాంతానికి చేరువలో ఉండే వశిష్ఠ నదిపై దిండి-చించినాడ మధ్య నిర్మించే రైల్వే వంతెన నిర్మాణ పనుల్లో ఒక పిల్లర్ నిర్మాణ దశలోనే కుంగిపోయింది. ఈ పిల్లర్‌ను ఏదోలా తిరిగి నిర్మించేందుకు కాంట్రాక్టు సంస్థ రెండు పర్యాయాలు చేపట్టిన ప్రయత్నాలు విఫలమయ్యాయి. అత్యంత వడివేగంగా ఉండడంతో ఈ నదిపై ఏ నిర్మాణ పనులు చేపట్టినా ఏదొక అవాంతరం ఉత్పన్నమవుతూనే ఉంది. గత మూడు దశాబ్దాల కిందట దిండి-చించినాడ మధ్య నిర్మించిన రహదారి వంతెన నిర్మాణ దశలోనూ అప్పట్లో ఓ పిల్లర్ నిర్మాణం ఇదే రీతిన కుంగిపోతే నిర్మాణ సంస్థ ప్రత్యామ్నాయంగా ఏర్పాట్లు చేసి ఆ వంతెన నిర్మాణాన్ని అప్పట్లో పూర్తిచేశారు. ఇప్పుడు మళ్లీ దిండి వైపు పీ-6 రైల్వే వంతెన పిల్లర్ కుంగిపోవడంతో ప్రస్తుతం ఆ పిల్లర్ పునఃనిర్మాణంపై రైల్వే కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులు సన్నాహాలు చేస్తున్నారు. కోటిపల్లి-నర్సాపురం రైల్వేలైన్ నిర్మాణంలో భాగంగా గౌతమీ, వైనతేయ, వశిష్ఠ నదీపాయలపై మూడు వంతెన నిర్మాణానికి పియర్స్ నిర్మాణాలను గత కొన్ని సంవత్సరాల నుంచి చేపట్టి ఇప్పటికే గౌతమీ, వైనతేయపై నిర్మాణాలను పూర్తిచేశారు. ఇక 1.3 కిలోమీటర్ల పొడవు కలిగిన దిండి-చించినాడ మధ్య రైల్వే వంతెన నిర్మాణానికి 20 పియర్స్ (పిల్లర్స్) నిర్మించే లక్ష్యంతో కాంట్రాక్టు సంస్థ కొన్నేళ్ల నుంచి పనులు చేపట్టి 20 పిల్లర్స్‌లో ఇప్పటికే 19 పిల్లర్స్‌ను పూర్తిస్థాయిలో నిర్మించారు. ఇక దిండివైపు పీ-6 పిల్లర్ నిర్మాణం సమయంలో వడివేగం ఎక్కువగా ఉండడం వల్ల కాంట్రాక్టు సంస్థల ప్రతినిధులు జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ పిల్లర్ కుంగిపోయింది. 50 మీటర్ల లోతున ఆ పిల్లర్‌ను నదీగర్భంలోకి దించాల్సి ఉండగా 23 మీటర్లు దిగిన తరువాత అనూహ్యంగా పిల్లర్ ఓవైపునకు కుంగిపోయి దిగబడిపోయింది. దాంతో కాంట్రాక్టు సంస్థ మరోసారి ప్రయత్నం చేసినప్పటికీ ఫలితం లేదనేది సంస్థ ప్రతినిధుల వాదన. గోదావరిలో ఈ పిల్లర్లను ప్రత్యేక బావి మాదిరిగా ఐరన్ నిర్మాణం చేసి అందులో కాంక్రీట్ నిర్మాణం పూర్తిచేస్తారు. ఇప్పుడు ఆ నిర్మాణమే దెబ్బతింది.

త్వరగా నిర్మిస్తేనే ముందుకు..

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో కూడిన యంత్ర సామగ్రిని తీసుకువచ్చి దిండి-చించినాడ మధ్య నిలిచిన పీ-6 పిల్లర్ నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తిచేయాలని కోనసీమ రైల్వే జేఏసీ కమిటీ కన్వీనర్ బండారు రామ్మోహనరావు విజ్ఞప్తి చేస్తున్నారు. ఇప్పటికే 19 పియర్స్ నిర్మాణం పూర్తయిన దృష్ట్యా ఈ ఒక్క పిల్లర్ నిర్మాణం పూర్తయితే గడ్డర్లు, ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమం అవుతుందని ఆయన అన్నారు. అయితే గత 30 ఏళ్ల కిందట రైల్వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టిన కూతవేటు దూరంలోనే దిండి-చించినాడ మధ్య ఆసియాలోనే ఆధునిక టెక్నాలజీతో అప్పట్లో నిర్మించిన వంతెన నిర్మాణ సమయంలో కూడా ఒక పిల్లర్‌కు ఈ తరహా సమస్య ఉత్పన్నమవడంతో అప్పట్లో సాంకేతిక నైపుణ్యంతో పిల్లర్ కుంగిన ప్రాంతంలోనే దానికి సపోర్టుగా మరో రెండు పిల్లర్లను నిర్మించడం ద్వారా వంతెన పూర్తి చేశారని స్థానికులు చెబుతున్నారు. ఇక్కడ ఎప్పుడూ గోదావరి నదీ ప్రవాహ వేగం ఎక్కువగా ఉంటుందని, లోతు కూడా అంచనాలకు మించి ఉండడం వల్ల ఈ నదిలో వారధుల నిర్మాణానికి ఇబ్బందులు అనివార్యమవుతున్నాయనడానికి రైల్వే వంతెన నిర్మాణంలో కుంగిన పిల్లర్ సంఘటనే ఉదాహరణ. త్వరలోనే కుంగిన పిల్లర్ల స్థానే సాంకేతిక పరిజ్ఞానంతో పిల్లర్ నిర్మాణాన్ని చేపట్టి రైల్వే ట్రాక్ ఏర్పాటుకు మార్గం సుగమం చేయాల్సి ఉంది.



సమావేశంలో మాట్లాడుతున్న మాధవి

2027 గోదావరి పుష్కరాలపై ఆర్డీవో సమీక్ష

రాజోలు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాజోలు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో 2027 గోదావరి పుష్కరాలపై వివిధ శాఖల అధికారులతో అమలాపురం ఆర్డీవో మాధవి శుక్రవారం రాజోలు నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. రాజోలు నియోజకవర్గంలో ఉన్న 20 పుష్కర ఘాట్‌లలో తగిన ఏర్పాట్లను తదితర అంశాలపై ఆయా శాఖల అధికారుల నుంచి ఆమె వివరాలు అడిగి తెలుసుకున్నారు. రాబోయే గోదావరి పుష్కరాలు పురస్కరించుకుని పుణ్యస్నానాలు ఆచరించే భక్తుల కోసం అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆమె సూచించారు. నియోజకవర్గంలో పాతవి 14 పుష్కర ఘాట్‌లు ఉండగా, కొత్తవి 6 పుష్కర ఘాట్‌ల ఏర్పాట్లకు ప్రతిపాదనలు తయారుచేయాలని సూచించారు. ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, రాజోలు ఎస్‌ఐ బి.రాజేష్‌కుమార్, తహశీల్దార్లు సీహెచ్ భాస్కరరావు, ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



డీఆర్వో రాజకుమారిని ఘనంగా సన్మానించి మెమెంటో అందజేస్తున్న కలెక్టర్, జేసీ, ఆర్డీవోలు

ఇన్‌చార్జి డీఆర్వోగా ఆర్డీవో మాధవి బాధ్యతలు

అమలాపురం, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెవెన్యూ, భూపరిపాలనను సమర్థవంతంగా నిర్వహించడానికి రెవెన్యూ సిబ్బంది కీలక పాత్ర పోషించాలని అమలాపురం ఆర్డీవో, జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఇన్‌చార్జి డీఆర్వోగా నియమితులైన కె.మాధవి అన్నారు. శుక్రవారం ఇన్‌చార్జి డీఆర్వోగా ఆమె బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టరేట్‌లోని వివిధ రెవెన్యూ సెక్షన్ల సూపరింటెండెంట్లతో సమావేశం నిర్వహించి వివిధ అంశాల ప్రగతిని, సిబ్బంది బాధ్యతల వివరాలు అడిగి తెలుసుకున్నారు. జిల్లా పాలనలో రెవెన్యూ వ్యవస్థ చాలా కీలకమైందని, వివిధ సెక్షన్లలో పనిచేస్తున్న అధికారులు అంకితభావంతో విధులు నిర్వహించాలని సూచించారు. ముఖ్యంగా రెవెన్యూ, నీటితీరువా పన్నుల వసూళ్లతోపాటు పట్టాదారు పాసుపుస్తకాలు, వివిధ ఫిర్యాదుల పరిష్కారంతో పాటు భూముల వ్యవహారంపై సత్వర స్పందన చేపట్టాలని కబ్జాల నివారణ, అసైన్డ్ ల్యాండ్ వినియోగంపై పర్యవేక్షణ ఉండాలని సూచించారు. వారసత్వ ధ్రువీకరణలతోపాటు నివాస, కుల ఆదాయ సర్టిఫికెట్ల జారీ, ప్రకృతి విపత్తుల సమయంలో సహాయక చర్యలు, నష్టాల అంచనా, నివేదికలు తయారుచేయడం వంటి అంచనాల్లో అప్రమత్తతో పనిచేయాలని సూచించారు. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించక విదేశాలకు వెళ్లి స్థిరపడ్డ కుటుంబాలను పోషించుకోదలచిన వారికి దిక్సూచి మార్గదర్శకంగా నెలకొల్పిన కోనసీమ వలసదారుల కేంద్రం ద్వారా వారికి సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో ఏవో కాశీవిశ్వేశ్వరరావు, సెక్షన్ల సూపరింటెండెంట్లు, వికాస మేనేజర్లు రమేష్ పాల్గొన్నారు.

డీఆర్వో రాజకుమారికి వీడ్కోలు

సత్కరించిన కలెక్టర్, జేసీ

గత 43 ఏళ్లుగా రెవెన్యూ విభాగంలో వివిధ హోదాల్లో విధులు నిర్వహించి అందరి మన్ననలు పొందిన డీఆర్వో రాజకుమారి సేవలు ప్రశంసనీయమని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ అన్నారు. గురువారం రాత్రి కలెక్టరేట్‌లో డీఆర్వో రాజకుమారి ఉద్యోగ విరమణ సందర్భంగా జరిగిన వీడ్కోలు సభలో కలెక్టర్ పాల్గొన్నారు. 1983 నుంచి ఇప్పటివరకు వివిధ హోదాల్లో ఎన్నో పదవులు నిర్వహించిన రాజకుమారి సర్వీసులో అందరి మన్ననలు పొందిన వ్యక్తిగా ఆమెను కొనియాడారు. జేసీ టి.నిషాంతి మాట్లాడుతూ డీఆర్వోగా రాజకుమారి జిల్లాలో రెవెన్యూ సమస్యల పరిష్కారానికి చేసిన కృషిని ఆమె ప్రశంసించారు. ఇటీవల నిర్వహించిన యోగా గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం లభించడంలో రాజకుమారి పాత్రను ప్రశంసించారు. తర్వాత ఆమెను కలెక్టర్, జేసీ సన్మానించి మెమెంటో అందజేశారు. ఆర్డీవోలు పి.శ్రీకర్, కె.మాధవి, డి.అఖిల, ఏవో కాశీవిశ్వేశ్వరరావు, రెవెన్యూ అసోసియేషన్ ప్రతినిధి దివాకర్ పాల్గొన్నారు.



అమలాపురంలో అర్బన్ హెల్త్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ చేసిన కలెక్టర్

అమలాపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అమలాపురం పురపాలక సంఘ పరిధిలోని ఈడబ్ల్యుఎస్ కాలనీలో ఉన్న అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీచేశారు. ఆరోగ్య కేంద్రంలో వైద్యులు, నర్సులు, ఆరోగ్య కార్మికులు, ల్యాబ్ టెక్నీషియన్లు ఎంతమంది పనిచేస్తున్నారని ఆరా తీసిన కలెక్టర్ వారి రికార్డులను పరిశీలించారు. వైద్య సేవలందిస్తున్న తీరును గమనించారు. పట్టణాల్లో పేదలకు అర్బన్ ప్రైమరీ ఆరోగ్య కేంద్రం ద్వారా నాణ్యమైన ఆరోగ్యసేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. డ్రగ్స్ స్టోర్స్‌లో రికార్డులతోపాటు ఆన్‌లైన్ విధానాన్ని పరిశీలించారు. అత్యవసర మందుల నిల్వలను తనిఖీ చేశారు. మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, ఆసుపత్రి వైద్యుడు డాక్టర్ ఎంఎం మణిదీప్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎం.దుర్గారావుదొర, తహశీల్దార్ అశోక్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అప్రమత్తతతోనే సైబర్ మోసాలకు అడ్డుకట్ట : ఎస్పీ



బ్యాంకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ బి.కృష్ణారావు

అమలాపురం టౌన్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముందస్తు అవగాహనతోనే సైబర్ మోసగాళ్ల వలకు చిక్కకుండా జాగ్రత్త పడవచ్చని, సెల్‌ఫోన్లకు వచ్చే అనవసర లింకుల జోలికి వెళ్లవద్దని జిల్లా ఎస్పీ బి.కృష్ణారావు పేర్కొన్నారు. సైబర్ మోసాలు ఎక్కువవుతున్న నేపథ్యంలో ప్రజలను చైతన్యవంతులను చేయడంలో బ్యాంకు నిర్వాహకుల పాత్ర ఎంతో కీలకమైందన్నారు. అమలాపురంలో శుక్రవారం బ్యాంకర్లతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ కృష్ణారావు మాట్లాడుతూ బ్యాంకులకు వచ్చే ఖాతాదారులకు సైబర్ మోసాలపై అవగాహన కల్పించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. బ్యాంకు ఖాతాలపై ఎప్పటికప్పుడు పరిశీలన ఉండాలని, స్ట్రాంగ్ కేవైసీ సిస్టమ్‌ను అవలంభించాలని సూచించారు. ఖాతాదారుల ఖాతాల్లో అధిక మొత్తంలో సొమ్ముల లావాదేవీలు జరుగుతుంటే అటువంటి వాటిని గమనించి మొదటి దశలోనే ఖాతాదారులను ప్రశ్నించి అప్రమత్తం చేయాలన్నారు. అనంతరం పోలీసులను సంప్రదించాలని సూచించారు. సమన్వయ సమావేశంలో సైబర్ అఫెన్స్ ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, డిజిటల్ అరెస్టు వంటి నేరాలకు సంబంధించిన విషయాలపై చర్చించి బ్యాంకు అధికారులకు, ఉద్యోగులకు అవగాహన కల్పించారు. ప్రధానంగా డిజిటల్ అరెస్టు పేరుతో నేరగాళ్లు పెద్ద మొత్తంలో సొమ్ములు లూటీ చేస్తున్న విధానంపై అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ సూచించారు. పెట్టుబడుల పేరుతో అధిక లాభాలు ఆశ చూపించి మీకు గిఫ్ట్ వచ్చిందని, బ్యాంకు ఖాతా నుంచి సొమ్ములు కట్ అయ్యాయని, విదేశీ సంబంధమని, బ్యాంకు మేనేజర్ పేరిట లక్షల్లో లాటరీ తగిలిందని తరహా మోసాలు ఇటీవల విపరీతంగా పెరిగాయన్నారు. డిజిటల్ అరెస్టులనేవి లేనేలేవని ప్రజలందరికీ తెలియచేయాలన్నారు. ప్రతీ బ్యాంకులో సైబర్ నేరాలు ఫిర్యాదు చేయడానికి, అక్కౌంట్ ఫ్రీజ్ విషయంలో 1930 టోల్‌ఫ్రీ నంబరుకు కాల్ చేయడానికి పాయింట్‌ఆఫ్ కాంటాక్ట్ ఏర్పాటుచేయాలని సూచించారు. బ్యాంకర్స్ అసోసియేషన్ జిల్లాశాఖ అధ్యక్షుడు వర్మ మాట్లాడుతూ జిల్లా పోలీసులు సూచించిన సూచనలను తప్పక పాటిస్తామన్నారు. బ్యాంకు మేనేజర్లు, ఆర్‌ఎంలతోపాటు అదనపు ఎస్పీ ఏవీఆర్‌పీబీ ప్రసాద్, అమలాపురం, కొత్తపేట డీఎస్పీలు టీఎస్ఆర్కే ప్రసాద్, సుంకర మురళీమోహన్, ట్రైనీ డీఎస్పీ ప్రదీప్తి పాల్గొన్నారు.



ఏటా జూన్ నుంచి నైరుతి రుతు పవనాల రాకతో వర్షాలు పుంజుకుంటాయి. ఈ ఏడాది కూడా సకాలంలోనే నైరుతి రుతుపవనాలు రావడంతో అంతా హమ్మయ్య అనుకున్నారు. వర్షాలకు లోటుండదని భావించారు. అటు ఖరీఫ్ సీజన్ పనులు ఆరంభించేశారు. తీరా చూస్తే ఈ సీజన్‌లో రుతుపవనాలు దాదాపుగా ముఖం చాటేశాయి. కుండపోతగా కురవాల్సిన వానలు జాడలేకుండా పోయాయి. దీంతో వర్షాభావ పరిస్థితులు తలెత్తాయి.

- ఉమ్మడి జిల్లాను వెన్నాడుతున్న వర్షాభావం
- జూలైలో కరుణ చూపని వరుణుడు
- సగం నైరుతి ముగిసినా చినుకు జాడ లేదు
- 60 మండలాల్లోనూ తీవ్ర లోటు
- మరోపక్క భానుడి భగభగలు
- జూన్‌లో కాస్తోకూస్తో బెటర్



(కాకినాడ-ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి జిల్లాను వర్షాభావం వెన్నాడుతోంది. నైరుతి రుతుపవనాలు ఊరించి ఊరించి ఉసూరు మనిపించాయి.జూన్‌లో కాస్త ప్రభావం చూపినా జూలైకు వచ్చే సరికి అసలు చినుకు జాడే లేదు.పైగా నైరుతి సీజన్ సగం ముగిసిపోవడంతో అన్ని మండలాలు తీవ్ర వర్షాభావంతో అల్లాడుతున్నాయి. ఒక్క కాకినాడ జిల్లాలో రెండు మండలాలు మినహా 19 మండలాలు లోటుతో ఉన్నాయి. తూర్పుగోదావరి, కోనసీమ జిల్లాల్లో మొత్తం 41 మండలాలు లోటు వర్ష పాతంతో రెడ్‌మార్క్ జాబితాలో చేరాయి. దీంతో ఆగస్టు, సెప్టెంబరు నెలల్లో కురిసే వర్షాలపైనే అన్నదాతలు ఆశలు పెట్టుకున్నారు.గతేడాది ఇదే సీజన్‌లో వద్దంటే వర్షాలు ఉమ్మడి జిల్లాను ముంచెత్తాయి.ఈ ఏడాది ఉమ్మడి జిల్లావ్యాప్తంగా జూలై అంతటా సూరీడు భగభగమంటూనే ఉన్నాడు. దీంతో జనం ఆపసోపాలతో అల్లాడారు.

కాకినాడ జిల్లా : జూన్‌లో రుతుపవనాల ప్రభావం అంతోఇంతో కనిపించింది. దీంతో కాకినాడ జిల్లా 21 మండలాల్లో సరాసరి 96.57 మి.మీ. వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా 120.75 మి.మీ. నమోదైంది. జూలైకు వచ్చేసరికి 198 మి.మీ. వర్షపాతం కురవాల్సి ఉంటే కేవలం 148 మి.మీ. మాత్రమే నమోదైంది. సరాసరిలో వ్యత్యాసం కొంతే ఉన్నా మండలాల వారీగా అధికంగా ఉంది. జూలైలో కాకినాడ జిల్లాలో గొల్లప్రోలు, తొండంగి మండలాలు మినహా మిగిలిన 19 మండలాలు వర్షా భావంతో అల్లాడుతున్నాయి. ఇదే గతేడాది జూలై లెక్కలు తీసుకుంటే కాకినాడ జిల్లాలో 198 మి.మీ.వర్షపాతం నమోద వ్వాల్సి ఉంటే ఏకంగా 223 మి.మీ. నమోదైంది. గడచిన జూన్, జూలైలో 300 మి.మీ.కు 269 మి.మీ. వర్షపాతం నమోదవడంతో మైనస్ 10.27 మి.మీ. లోటు తేలింది.

కోనసీమ జిల్లా : జూన్ నెలలో సరాసరి 102 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 108 మి.మీ. కురిసింది. 22 మండలాలకు 11 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. 11 మండలాల్లో మాత్రమే అధికంగా కురిసింది. జూలైకు వచ్చేసరికి తీవ్ర వర్షాభావం వెన్నాడింది. జిల్లా సరాసరి 241 మి.మీ. వానకుగాను 150మి.మీ. నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే మాత్రం 22 మండలాలు తీవ్ర లోటులో చిక్కుకు న్నాయి. గతేడాది జూలైలో కోనసీమ జిల్లా అంతా కలిపి 241 మి.మీ.వానకుగాను 339 మి.మీ. కురిసింది. అన్ని మండలాలు పుష్కలంగా వర్షంతో కళకళలాడాయి. ఈ జిల్లాలో జూన్,జూలై కలిపి మొత్తం 347.49 మి.మీ. సరాసరి వర్షపాతానికిగాను 258.37 మి.మీ. మాత్రమే నమోదై మైనస్ 25.65 మి.మీ. లోటుతో కొనసాగుతోంది.

తూర్పుగోదావరి జిల్లా : జూన్‌లో 107.77 మి.మీ.కు 145.27మి.మీ. వర్షం కురవడంతో బిక్కవోలు, కోరుకొండ మండలాలు మినహా మిగిలిన 17 మండలాలు అదనపు వర్షపాతం జాబితాలోకి చేరాయి. జూలైకు వచ్చేసరికి 247 మి.మీ. సరాసరి వర్షపాతానికి 169 మి.మీ. మాత్రమే కురిసింది.అదే మండలాల వారీగా చూస్తే మాత్రం మొత్తం 19 మండలాలు లోటు వర్షపాతంతో రెడ్‌మార్క్‌లోకి వెళ్లిపోయాయి. అదే గతేడాది జూలైలో జిల్లావ్యాప్తంగా 247 మి.మీ. వర్షం కురవాల్సి ఉంటే 374 మి.మీ కురిసి అదనపు వర్షపాతం జాబితాలోకి వెళ్లిపోయాయి.ఈ జూన్, జూలై నెలల్లో తూ.గో. జిల్లాలో సరాసరి 363.18 మి.మీ. వర్షపాతం నమోదవాల్సి ఉండగా 316.22 మి.మీ. నమోదైంది.

లోటు వర్షపాతం..

ప్రస్తుతం నైరుతి రుతుపవనాల సీజన్ అప్పుడే సగం ముగిసిపోయింది. కానీ వాన జాడలేక లోటు వర్షపాతం వెన్నాడుతోంది. మరోపక్క రుతుపవనాల కారణంగా రోజంతా కారు మబ్బులతో వాతావరణం చల్లగా మారి వానలు కురవాల్సి ఉంటే దీనికి భిన్నంగా ఉదయం ఏడు నుంచే సూరీడు దంచేస్తున్నాడు. అసలు సిసలు వేసవిని తలపిస్తూ సాయంత్రం వరకు తీవ్ర వేడి, ఉక్కపోత కొనసాగుతోంది. ఉష్ణోగ్రతలు సైతం 35 దాటిపోతోంది. అటు విద్యుత్ వినియోగం భారీగా తగ్గాల్సిన సమయంలోను తీవ్రంగా డిమాండ్ పెరిగిపోతోంది. గడచిన రెండు నెలల్లో వానలు కురవాల్సిన దానికంటే తక్కువగా కురిసిన నేపథ్యంలో ఇంకా ఆగస్టు, సెప్టెంబరు నెలలే రుతుపవనాల ప్రభావంతో వానలు భారీగా కురవడానికి అవకాశం ఉంది. అయితే మరి వరుణుడు ఏం చేస్తాడో చూడాలి.


జాతీయ పతాకాన్ని ఎగుర వేస్తున్న కలెక్టర్ షాన్‌మోహన్



హాకీ మాంత్రికుడు మేజర్ ధ్యాన్‌చంద్ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు (పైన), జ్యోతిప్రకాశనం చేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ (కింద)



మార్చ్‌ఫాస్ట్ చేస్తున్న ఏపీ క్రీడాకారులు



హోరాహోరీగా తలపడుతున్న మిజోరాం, రాజస్థాన్ జట్ల క్రీడాకారులు

క్రీడా సంరంభం

కాకినాడలో అట్టహాసంగా ప్రారంభమైన 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): హాకీ ఇండియా జూనియర్ మహిళల 15వ జాతీయ చాంపియన్‌షిప్ కాకినాడలో శుక్రవారం సాయంత్రం అట్టహాసంగా ప్రారంభమైంది. కలెక్టర్ షాన్‌మోహన్, ఎస్పీ జి.బిందుమాధవ్, ఎమ్మెల్సీలు కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి ముఖ్య అతిథులుగా, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, ఏఎస్పీ మనీష్ దేవరాజ్ పాటిల్, అసిస్టెంట్ కలెక్టర్ మనీషా, డీఎఫ్‌వో రవీంద్రనాథ్‌రెడ్డి, హాకీ ట్రిపుల్ ఒలింపియన్ ఆశాంత్ర లాక్ర, ధ్యాన్‌చంద్ అవార్డు గ్రహీత సత్య గీత, హాకీ ఆంధ్రప్రదేశ్ అధ్యక్షుడు బి.చాణుక్యరాజు, జనసేన పిఠాపురం నియోజకవర్గ ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాస్ అతిథులుగా హాజరయ్యారు. తొలుత జిల్లా క్రీడా మైదానంలోని హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ విగ్రహానికి కలెక్టర్, ఎస్పీ, ఎమ్మెల్సీలు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం హాకీ పోటీల ప్రారంభ సూచికగా కలెక్టర్ షాన్‌మోహన్ జాతీయ పతాకాన్ని, హాకీ ఇండియా పతాకాన్ని ఆశంత్రా లాక్ర, రాష్ట్ర పతాకాన్ని ఎమ్మెల్యే నానాజీ ఆవిష్కరించారు. వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 18 హాకీ జట్లతో మార్చ్‌ఫాస్ట్, పెరేడ్ ఘనంగా జరిగింది. ఆతిథ్యం ఇస్తున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా జట్టు క్రీడాకారిణి లక్ష్మీప్రసన్న క్రీడా స్ఫూర్తితో టోర్నమెంటును విజయవంతం చేస్తామని అన్ని జట్ల క్రీడాకారులతో ప్రతిజ్ఞ చేయించారు.

అనంతరం కలెక్టర్ షాన్‌మోహన్ 15వ హాకీ ఇండియా జూనియర్ మహిళల జాతీయ చాంపియన్‌షిప్‌ను ప్రారంభిస్తున్నట్టు ప్రకటించి బెలూన్లను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో అందరి సహకారంతో పోటీలను ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. 12రోజుల పాటు జరిగే పోటీల్లో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు వివిధ శాఖల అధికారులతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. టోర్నమెంటు నిర్వహణకు వివిధ అంశాలను స్పాన్సర్ చేస్తూ ఆర్థిక సహకారం అందించిన కార్పొరేట్, వ్యాపార, పారిశ్రామిక సంస్థల యాజమాన్యాలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఎస్పీ బిందుమాధవ్ మాట్లాడుతూ ఏడు నెలల వ్యవధిలో రెండోసారి జాతీయ స్థాయి పోటీలకు కాకినాడ వేదిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరూ ఉత్తమ క్రీడా నైపుణ్యాలను ప్రదర్శించి క్రీడా స్ఫూర్తి చాటాలన్నారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ హాకీ టోర్నమెంట్ సజావుగా జరిగేందుకు అవసరమైన భోజనం, వసతి ఇతర అన్ని ఏర్పాట్లు సమకూర్చామని, 12 రోజులు జరిగే క్రీడా పండుగను విజయవంతం చేయాలన్నారు. జాతీయ సాయిలో జరుగుతున్న రైఫిల్ షూటింగ్ పోటీలకు సిద్ధమవుతున్న కాకినాడ నగర క్రీడాకారిణి ఆశ్రితకు కోకనాడ కోస్టల్ స్పోర్ట్స్ క్లబ్ ఫౌండర్ రవీంద్ర స్పాన్సర్ చేసిన రూ.2లక్షల చెక్‌ను కలెక్టర్, ఎస్పీ అందజేశారు. కార్యక్రమంలో కాకినాడ ఆర్డీవో ఎస్.మల్లిబాబు, డీఎస్‌డీవో బి.శ్రీనివాసకుమార్, సెట్రాజ్ సీఈవో కేఎస్వీ కాశీవిశ్వేశ్వరరావు, సమాచార, పౌరసంబంధాల శాఖ డిప్యూటీ డైరెక్టర్ డి.నాగార్జున, బీసీ కార్పొరేషన్ ఈడీ ఎ.శ్రీనివాసరావు, అర్బన్ తహసీల్దారు వి.జితేంద్ర తదితరులు పాల్గొన్నారు.


ప్రారంభ సభలో మాట్లాడుతున్న కలెక్టర్ షాన్‌మోహన్

తొలిరోజు విజేతలు

కాకినాడ జిల్లా క్రీడా మైదానంలో శుక్రవారం ప్రారంభమైన 15వ జాతీయ జూనియర్ మహిళల హాకీ పోటీల్లో భాగంగా తొలిరోజు....

ఎ-డివిజన్‌లో గోయన్స్ హాకీ, జమ్ముకశ్మీర్ మధ్య జరిగిన మ్యాచ్‌లో గోయన్స్ జట్టు 2-1 స్కోరుతో, తెలంగాణ-గుజరాత్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 4-1 స్కోరుతో గుజరాత్, మిజోరాం-రాజస్థాన్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 12-0 స్కోరుతో మిజోరాం విజయం సాధించాయి.

బి-డివిజన్‌లో మణిపూర్-కేరళ మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 స్కోరుతో మణిపూర్, అసోం-పాండిచ్చేరి మధ్య జరిగిన మ్యాచ్‌లో 5-0 స్కోరుతో అసోం, హిమాచల్‌ప్రదేశ్- అరుణాచల్‌ప్రదేశ్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6-2 స్కోరుతో అరుణాచల్‌ప్రదేశ్, ఢిల్లీ-హాకీ అసోసియేషన్ ఆఫ్ బిహార్ మధ్య జరిగిన మ్యాచ్‌లో 6-3 స్కోరుతో ఢిల్లీ విజయం సాధించాయి. మ్యాచ్‌లను టోర్నీ కో-ఆర్డినేటర్ వి.రవిరాజు పర్యవేక్షించారు.



కింగ్స్ జట్టు ఫ్రాంచైజీలతో కెప్టెన్ భరత్

కాకినాడ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం

గర్వంగా ఉంది

ప్రముఖ క్రికెట్ క్రీడాకారుడు కేఎస్ భరత్

కార్పొరేషన్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కింగ్స్ జట్టుకు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉందని, తన జీవితంలో ముఖ్యమైన వారంతా కాకినాడలోనే ఉన్నారని క్రికెటర్ కేఎస్ భరత్ పేర్కొన్నారు. శుక్రవారం క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో కాకినాడలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తన తల్లిదండ్రులు, గ్రాండ్ పేరెంట్స్ కాకినాడలోనే చదువుకున్నారన్నారు. పుట్టింది కాకినాడలోనే అయినా విశాఖ తనను దత్తత తీసుకుందని తెలిపారు. అండర్- 13 విభాగంలో కాకినాడలో మ్యాచ్‌లు ఆడానంటూ ఆ రోజులను గుర్తు చేసుకున్నారు. ఆంధ్రా ప్రీమియర్ లీగ్‌లో పాల్గొనే కాకినాడ కింగ్స్ జట్టు సభ్యులు ఆర్ఎంసీ మైదానంలో సాధన చేస్తున్నారన్నారు. రాజ్యసభ సభ్యుడు సానా సతీష్‌బాబు కృషితో ఆంధ్రా క్రికెట్ సంఘం అభివృద్ధి చెందుతోందన్నారు. విలేకరుల సమావేశంలో కింగ్స్ జట్టు ఫ్రాంచైజీలు రామ్, అవినాష్, కార్యదర్శి సత్యనారాయణ, కోచ్ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మేము.. ఎలా వెళ్లేది!

- పేరుకే ఫాస్ట్ పాసింజర్
- ప్రయాణం మాత్రం చాలా నెమ్మది
- అపరిశుభ్రంగా టాయిలెట్లు
- అవస్థలు పడుతున్న ప్రయాణికులు






నిడదవోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఈ రైలు కోసం ప్రతి రోజూ వెయ్యి కళ్లతో ఎదురుచూస్తారు. అరగంట ఆలస్యమైంద ంటే ఒకటే టెన్షన్.. ఎక్కేవారు.. దిగేవారితో నిత్యం రద్దీగా నే ఉంటుంది. అయినా ఆ రైలుపై ఎందుకో రైల్వే శాఖకు చిన్న చూపు.. సమస్యలు పట్టించుకోరు.. చెప్పినా వినిపించు కోరు.. చేసేది లేక అంత డిమాండ్ ఉన్న రైలులో నిత్యం ముక్కుతూ మూలుగుతూ ప్రయాణం చేస్తున్న వారి సంఖ్య వేలల్లో ఉంటుంది. నిత్యం కాకినాడ పోర్టు నుంచి విజయవాడకు, తిరిగి సాయంత్రం విజయవాడ నుంచి కాకినాడ పోర్టుకు చేరుకుంటుంది. ఈ రైలులో ఉద్యోగులు, ఉపాధి కోసం వేరే ప్రాంతాలకు వెళ్లే వారు ఎందరో రాకపోకలు సాగిస్తుంటారు. వేరే ప్రాంతాల్లో ఉద్యోగాలు చేసుకుంటున్నవారు అక్కడ పనిచేసే ప్రాంతాల్లో ఇళ్ల అద్దెలు భరించలేక, కుటుంబాలను, ఉన్న ఊరిని మార్చలేక ఇలా ఎన్నో కారణాలతో ఈ ఫాస్ట్ పాసింజర్ రైలులో ఉదయం వెళ్లి సాయంత్రం వచ్చేందుకే మక్కువ చూపుతున్నారు. కొవి డ్‌కు ముందు 16 బోగీలతో ఫాస్ట్ పాసింజర్‌గా రాకపోకలు సాగించే ఈ రైలు కొవిడ్ తరువాత 8 బోగీలతో ఎక్స్‌ప్రెస్ చార్జీలను వసూలు చేస్తోంది. ఇలా రైలులో మూడే టాయ్‌లెట్స్ ఉండడంతో ప్రయాణికులు నరకయాతన అనుభవిస్తున్నారు. అవి కూడా అత్యంత దారుణంగా ఉంటున్నాయని ప్రయాణికులు వాపోతున్నారు. రైల్వే శాఖకు ఎంతో ఆదాయాన్ని తెచ్చిపెడుతున్న ఫాస్ట్ పాసింజర్ రైలులో బోగీలను పెంచి చార్జీలను తగ్గించి పరిశుభ్రతకు ప్రాధాన్యతకు ఇవ్వాలని రైల్వే అధికారులను ప్రయాణికులు కోరుతున్నారు.

యువర్ అటెన్షన్ ప్లీజ్.. ఈ ట్రైన్ పేరు విజయవాడ మేము. కానీ ఉభయ గోదావరి జిల్లాలో ఇది ఎంతోమందికి ఫాస్ట్ పాసింజర్ రైలుగానే తెలుసు. కొవిడ్‌కు ముందు ఫాస్ట్ పాసింజర్‌గా తిరిగిన రైలు కొవిడ్ తరువాత ఎక్స్‌ప్రెస్ పేరుతో తిరుగుతోంది. కానీ జర్నీ మాత్రం పాసింజరే. చార్జీలు ఎక్కువయ్యాయి.. దీంతో ప్రయాణికులకు పాట్లు తప్పడంలేదు.

ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు



నిత్యం రైలులో నిడదవోలు నుంచి విజయవాడకు తిరిగి నిడదవోలుకు రాకపోకలు సాగిస్తుంటా. ఈ ఫాస్ట్ పాసింజర్ రైలుకు ఎక్స్‌ప్రెస్ పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు.రైలులో టాయ్‌లెట్లు ఏమాత్రం శుభ్రంగా ఉంచరు. రైల్వే అధికారులు ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించడం లేదు.

-వెంకటేశ్వరరావు, ప్రయాణికుడు.

ఒక బోగి కూడా పెంచరు



ఈ రైలు ప్రయాణిల్లో నేను ఒకడిని. కొవిడ్‌కు ముందు 16 బోగీలతో ఉండే రైలు ఆపై 8 బోగీలకు పరిమితమైంది. ఎప్పుడు రద్దీగా ఉండే రైలుకు కనీసం ఒక బోగి కూడా పెంచరు. ఎక్స్‌ప్రెస్ పేరుతో టికెట్‌కు అధిక ధరలు వసూలు చేస్తున్నా ప్రయాణం తప్పడం లేదు.

-సురేష్, ప్రయాణికుడు.



బాలాత్రిపుర సుందరికి సామూహిక

కుంకుమ పూజలు

కొవ్వూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కొవ్వూరు గోష్పాదక్షేత్రంలోని శ్రీబాలాత్రిపుర సుందరీ సమేత సుందరేశ్వరస్వామి ఆలయంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా మహిళలు అమ్మవారికి సామూహిక కుంకుమ పూజలు చేశారు. ఆలయ అర్చకులు మానేపల్లి శ్రీనివాసశాస్త్రి పర్యవేక్షణలో సుందర గణేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి విశేష అలంకరణ చేసి ప్రత్యేక పూజలు చేశారు. పట్టణ పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అలాగే సంస్కృత పాఠశాల ప్రాంగణంలో ఉన్న లలితపార్వతీ అమ్మవారికి అర్చకులు మానేపల్లి సుబ్రమ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు.

ఏటికొప్పాక బొమ్మలు కొనుగోలు చేసిన నాగబాబు

పిఠాపురం రైల్వే స్టేషన్‌లో వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్ షాపు ప్రారంభం


ఏటికొప్పాక బొమ్మ కొనుగోలు చేస్తున్న ఎమ్మెల్సీ నాగబాబు

పిఠాపురం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ప్రధాన మంత్రి నరేంద్రమోదీ ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన వన్ స్టేషన్-వన్ ప్రొడక్ట్‌లో భాగంగా కాకినాడ జిల్లా పిఠాపురం రైల్వే స్టేషన్‌లో సెర్ప్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన హ్యాండీక్రాఫ్ట్ స్టాల్‌ను జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి, ఎమ్మెల్సీ కొణిదల నాగబాబు శుక్రవారం ప్రారంభించారు. ఏటికొప్పాక బొమ్మలను పరిశీలించిన ఆయన కొన్నిటిని కొనుగోలు చేశారు. అనంతరం పిఠాపురం పట్టణ శివారు ఏడు కాలువల వద్ద వ్యవసాయ శాఖ అందజేసిన డ్రోన్లను ప్రారంభించారు. కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు ఆనందనగర్‌లో జనసేన వీర మహిళ పిట్టా ముని ఇల్లు అగ్ని ప్రమాదంలో దగ్ధం కావడంతో జనసేన నాయకుడు జ్యోతుల శ్రీనివాస్ సహకారంతో ఇంటిని నిర్మించారు. ఆ ఇంటి తాళాలను ఆమెకు నాగబాబు అందజేశారు.

జాతీయ టేబుల్ టెన్నిస్ క్రీడాకారులకు శిక్షణ


క్రీడాకారులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

ఎటపాక, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎటపాక జవహర్ నవోదయ విద్యాలయంలో రీజనల్ స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీల అనంతరం జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన 42 మంది విద్యార్థులకు శుక్రవారం ప్రత్యేక శిక్షణ ప్రారంభించారు. వీరికి భారత టేబుల్ టెన్నిస్ రిప్రజెంటేటర్ రియాజ్ శిక్షణ ఇవ్వనున్నట్టు వైస్ ప్రిన్సిపాల్ ప్రసాద్ తెలిపారు. వీరిలో 21 మంది బాలురు, 21 మంది బాలికలు ఉన్నారు. శిక్షణలో విద్యార్థులకు అన్ని రకాల మెలకువలతోపాటు ప్రతి రోజు హైజెనిక్ ఆహారం అందిస్తారు. 15 రోజుల శిక్షణ అనంతరం జాతీయ స్థాయి పోటీలకు అస్సాం వెళ్లనున్నారు. ఈ నెల 18,19,20 తేదీల్లో అక్కడ జరిగే పోటీల్లో పాల్గొననున్నారు.

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురికి ఉద్యోగాలు


జేఎన్టీయూకే వీసీతో ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులు

జేఎన్టీయూకే, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): కాకినాడ జేఎన్టీయూలోని యూసీఈకే ప్లేస్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో నలుగురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికైనట్టు పీఆర్వో ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. 40 మంది హాజరు కాగా బ్యాంకింగ్ టెక్నాలజీ కంపెనీ జిటా ద్వారా సీఎస్ఈ విద్యార్థులు పి.హర్షవర్ధన్, వీసీహెచ్ఎన్ఎస్‌వీఎల్ వైష్ణవి, సీహెచ్ ప్రీతి, జి.వెంకటశ్రీ సుమేధ ఎంపికయ్యారు. వీరికి రూ.18లక్షల వార్షిక ప్యాకేజీ ఇస్తారన్నారు. ఆరు నెలల పాటు ఇంటర్న్‌షిప్ ఉంటుందని, ప్రతినెలా రూ.60 వేలు స్టైఫండ్ అందజేస్తారు. ఉద్యోగార్థులను ఉప కులపతి సీఎస్ఆర్కే ప్రసాద్, ప్రిన్సిపాల్ ఎన్.మోహన్‌రావు, ప్లేస్‌మెంట్ సెల్ అధికారి డాక్టర్ అరవ కరుణ అభినందించారు.

వాడపల్లి వెంకన్న ఆలయంలో పూజలు


వాడపల్లి వెంకన్న ఆలయంలో పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

ఆత్రేయపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): వాడపల్లి వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. నోము ఆచరించిన అష్టోత్తర పూజలు, నిత్యకళ్యాణాలు నిర్వహించుకున్నారు. అన్నప్రసాదం స్వీకరించారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.4,71,925 లభించినట్టు ఉపకమిషనరు, ఈవో నల్లం సూర్యచక్రధరరావు తెలిపారు. రాత్రి దేవదాయ శాఖ అదనపు కమిషనరు తెనాలి చంద్రశేఖర్ కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. వారికి వేద పండితుల ఆశీర్వచనం అందించగా ఈవో స్వామివారి చిత్రపటం అందించారు.

పనులు పరిశీలించిన ఆర్డీవో.. ఆలయంలో చేపడుతున్న అభివృద్ధి పనులను కొత్తపేట ఆర్డీవో శ్రీకర్ పరిశీలించారు. వకుళమాత అన్నదాన భవన నిర్మాణం, కోనేరు నిర్మాణ పనులతోపాటు భక్తుల సౌకర్యార్థం నిర్మిస్తున్న రహదారులు, మంచినీటి సౌకర్యం, వైద్య శిబిరాలు, క్యూలైన్ల ఏర్పాట్లను పరిశీలించారు.

జలజీవన్‌తో గ్రామాల్లో నీటి నాణ్యత పరీక్షించాలి

కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): గాలి నాణ్యత సూచికను లెక్కించే తరహాలోనే నీటి నాణ్యత సూచికను లెక్కించడానికి దేశంలో ఎలాంటి ప్రామాణిక వ్యవస్థ లేదని, గ్రామాల్లో జలజీవన్ మిషన్ ద్వారా నీటి నాణ్యతను పరీక్షించాలని కాకినాడ ఎంపీ ఉదయ్‌శ్రీనివాస్ కోరారు. నీటి నాణ్యతపై రియల్‌టైం మోనిటరింగ్, వాటర్ క్వాలిటీ ఇండెక్స్ ఏర్పాటుపై శుక్రవారం ఆయన అడిగిన ప్రశ్నకు కేంద్ర జలశక్తి శాఖ సహాయ మంత్రి సోమన్న లిఖిత పూర్వకంగా సమాధానమిచ్చారు. పట్టణ ప్రాంతాల్లో నీటి నాణ్యత పర్యవేక్షణ బాధ్యత ఆయా రాష్ట్ర ప్రభుత్వాలదేనని పేర్కొన్నారు. అమృత్, అమృత్ 2.0 మార్గదర్శకాల ప్రకారం ప్రత్యేకమైన డబ్ల్యూక్యూఐ లెక్కింపును కేంద్రం నిర్దేశించలేదని బదులిచ్చారు. నీటి నాణ్యతా ప్రమాణాల అమలుపై పర్యవేక్షణ జరుగుతుందన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశ వ్యాప్తంగా 3.92 లక్షల గ్రామాల్లో 2.48 లక్షల ప్రయోగశాల నమూనాలు సేకరించినట్టు వెల్లడించారు.

తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సులో

జీఎస్ఎల్ వైద్య విద్యార్థికి చోటు


ఫణి అజయ్‌ను అభినందిస్తున్న డాక్టర్ గన్ని భాస్కరరావు

రాజానగరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): విశేషమైన అధ్యయనం చేసి పీర్-రివ్యూడ్ జర్నల్‌కు పరిశోధన పత్రాన్ని సమర్పించిన రాజానగరం జీఎస్ఎల్ వైద్య కళాశాల ఎంబీబీఎస్ విద్యార్థి, పశ్చిమ గోదావరి జిల్లా తణుకుకు చెందిన జీజీ ఫణిఅజయ్ పేరు తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు నమోదయ్యింది. 19 సంవత్సరాల కేటగిరిలో అతడికి ఈ గౌరవం దక్కింది. గ్రామీణ ప్రాంత ఉపాధ్యాయుల్లో ఎఫ్ఈవీ-1 ప్లేట్‌లెట్ పారామీటర్లపై ఫిజియాలజీ ప్రొఫెసర్ డాక్టర్ కవిత మార్గదర్శకత్వంలో అజయ్ ఈ పరిశోధన చేశారు. దీనిని వేలూరు సీఎంసీలో జరిగిన ఎండ్రోక్రినాలజీ అంతర్జాతీయ కాంగ్రెస్‌లో సమర్పించగా సైంటిఫిక్ జర్నల్‌లో ప్రచురితమైంది. గ్రామీణ టెక్స్‌టైల్ కార్మికులు, పాఠశాల ఉపాధ్యాయుల బయోకెమికల్ పారామీటర్లపై అజయ్ చేసిన పరిశోధనకు బయోకెమిస్ట్రీ ప్రొఫెసర్ యూబీ విజయలక్ష్మి మార్గదర్శకత్వం వహించారు. దీనిని కాకినాడలో జరిగిన సైంటిఫిక్ కాన్ఫరెన్స్‌లో సమర్పించి ప్రచురించారు. ఈ సందర్భంగా అజయ్‌ను జీఎస్ఎల్ సంస్థల చైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు, ఎండీ డాక్టర్ గన్ని సందీప్, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్కే మిశ్రా తదితరులు అభినందించారు.

వ్యక్తి మృతి కేసులో తల్లీకూతుళ్ల అరెస్ట్

మండపేట, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): వ్యక్తి అనుమానాస్పద కేసులో తల్లీకూతుళ్లను పోలీసులు అరెస్టు చేశారు. వివరాల ప్రకారం.. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ఇప్పనపాడు పంచాయతీ పరిధిలో ఎర్రదిబ్బకాలనీకి చెందిన వాకాడ వీర్రాజు (45) ఇంటిలో భార్య, కూమార్తెతో గొడవపడి మరుసటిరోజు అనుమానాస్పదంగా మృతిచెందాడు. వీర్రాజు గుండెపోటుతో మరణించాడని అతడి భార్య, కూమార్తె అందరినీ నమ్మించారు. గత నెల 17న జరిగిన ఈ సంఘటనపై వీర్రాజు కుమారుడు మండపేట రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు. తన తల్లి, చెల్లి కలిసి తండ్రిని హత్యచేసి గుండెపోటుగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని చెప్పడంతో గత నెల 21న పోలీసు, రెవెన్యూ అధికారులు వీర్రాజు మృతదేహాన్ని వెలికితీసి పోస్టుమార్టం నిర్వహించారు. అనంతరం దర్యాప్తులో వీర్రాజు భార్య సత్యవేణి, కుమార్తె లావణ్యను అరెస్టు చేసి శుక్రవారం ఆలమూరు మున్సిపల్ కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి 14రోజుల పాటు రిమాండ్ విధించారు. వారిని రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని మండపేట రూరల్ ఎస్ఐ కిషోర్ తెలిపారు.

పోక్సో కేసుపై డీఎస్పీ విచారణ

అల్లవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అల్లవరం మండలంలో ఓ గ్రామంలో 16 ఏళ్ల బాలికపై అత్యాచారం చేసిన యువకుడిపై పోక్సో చట్టం కేసు నమోదు కావడంతో అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్కే ప్రసాద్ శుక్రవారం విచారణ చేపట్టారు. బాలికపై అయినవిల్లి మండలంలో ఓ గ్రామానికి చెందిన నవుంద్రు రాకేష్ అత్యాచారం చేశాడని బాలిక తల్లిదండ్రులు అల్లవరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో డీఎస్పీ, అమలాపురం రూరల్ సీఐ డి.ప్రశాంత్‌కుమార్ ఘటనా స్థలిలో దర్యాప్తు చేశారు. క్లూస్‌టీమ్ ఆధారాలు సేకరించింది. ఏఎస్ఐ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

స్కూల్ బస్సు ఢీకొని టీడీపీ కార్యకర్త మృతి


నాగరాజు (ఫైల్)

ఉప్పలగుప్తం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం వానపల్లిపాలెం పంచాయతీ బొర్రాయిపాలెంకు చెందిన టీడీపీ కార్యకర్త దోనిపాటి నాగరాజు (30) గురువారం హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. బైక్‌పై వెళ్తున్న నాగరాజును స్కూల్ బస్సు ఢీకొనడంతో ప్రమాదం జరిగినట్టు మృతుడి తండ్రి గణపతి తెలిపారు. పోస్టుమార్టం అనంతరం నాగరాజు మృతదేహాన్ని బొర్రాయిపాలెం తీసుకువస్తున్నట్టు సర్పంచ్ నల్లా బాబండి తెలిపారు.

నకిలీ టీపొడి విక్రయంపై కేసు

రావులపాలెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తమ కంపెనీకి చెందిన పేరుతో నకిలీ టీపొడి విక్రయిస్తున్నారంటూ వచ్చిన ఫిర్యాదుపై రావులపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... టాటా చక్రగోల్డ్ లేబుల్‌తో ఉన్న నకిలీ టీపొడిని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం షిరిడి సాయి మణికంఠ దుకాణంలో విక్రయిస్తున్నారంటూ కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ శేఖర్‌బాబు తెలిపారు.

మహిళను గాయపరిచిన వ్యక్తి అరెస్ట్

దేవీపట్నం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): మహిళను గాయపరిచిన వ్యక్తిపై శుక్రవారం దేవీపట్నం పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్ఐ షరీఫ్ తెలిపిన వివరాల ప్రకారం.. అల్లూరి జిల్లా దేవీపట్నం మండలం పరగసానిపాడు ఆర్అండ్ఆర్ కాలనీకి చెందిన మహిళను పెద్దభీంపల్లి గ్రామానికి చెందిన నేలపాటి రాజేష్ కర్రతో గాయపరిచాడు. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు.

భక్తులకు మెరుగైన సేవలందించాలి


సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ రామచంద్రమోహన్

- సేవాదల్ ద్వారా వచ్చే సేవకులను వినియోగించుకోవాలి
- ఖర్చు చేసే ప్రతిరూపాయి సౌకర్యాల కల్పనకు ఉపయోగపడాలి
- దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్
- అన్నవరం దేవస్థానంలో అధికారులు, సిబ్బందితో సమీక్ష

అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఆలయాల్లో సేవలందించేందుకు విచ్చేసే సేవాదల్ సభ్యుల సేవలను వినియోగించుకుని వారి ద్వారా భక్తులకు మరింత మెరుగైన సేవలందించాలని దేవదాయ కమిషనర్ రామచంద్రమోహన్ సూచించారు. శుక్రవారం కాకినాడ జిల్లా అన్నవరం దేవస్థానంలో ఆగమ పాఠశాల, ఇతర నిర్మాణాలను పరిశీలించి కమాండ్ కంట్రోల్‌రూం నందు అన్ని విభాగాల ఏఈవోలు, సూపరెంటెండెంట్, ఇంజనీరింగ్ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సిబ్బంది జీతాల కోసం పనిచేస్తుండగా సేవాదల్ సభ్యులు అవేమి ఆశించకుండా సేవలందిస్తున్నారని వారికి సౌకర్యాల కల్పన విషయంలో రాజీపడవద్దని సూచించారు. ఇంజనీరింగ్ విభాగం ద్వారా ఖర్చు చేసే ప్రతిరూపాయి భక్తుల సౌకర్యాల కల్పనకు ఉపయోగపడేవిధంగా ఖర్చుపెట్టాలన్నారు. ఆగమ పాఠశాల పరిశుభ్రతపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన విద్యార్థులు తమ ఆహార పదార్థాలు స్వీకరించిన ప్లేట్‌లు, గ్లాసులు వేడినీటితో శుభ్రంచేసేందుకు వీలుగా గ్రీజర్‌ను ఏర్పాటు చేయాలని, అదేవిధంగా అదనంగా మరో మనిషిని ఏర్పాటుచేయాలని ఆదేశించారు. ప్రస్తుతం ఉన్న మెయిన్ క్యాంటీన్ లైసెన్స్ హక్కుకు ఎవరూ రానందున దానిని డార్మెటరీగా వినియోగించుకోవాలని సూచించారు. సీఆర్వో కార్యాలయం వద్ద నూతనంగా భక్తులకు అవసమైన తినుబండారాలు విక్రయించుకునేందుకు క్యాంటీన్ ఏర్పాటుచేయాలన్నారు. సిబ్బంది అంతా ఎస్‌ఓపీ నిబంధనలు పాటించాలని, శానిటేషన్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. సెంట్రలైజ్డ్ శానిటేషన్ కాంట్రాక్ట్ ఈనెల 15 కల్లా ఫైనల్ అవుతుందని ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ఒక ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు.

కాంట్రాక్ట్ పారిశుధ్య కార్మికులు పీఎఫ్ సొమ్ముల విషయమై కమిషనర్‌ను కలవగా కార్మికులు ప్రతినెలా తమ సొమ్ములు జమ అవుతున్నాయా లేదా అనేది చూసుకోవలసిన బాధ్యత ఉందన్నారు. వర్షపు నీరు వృథాగా పోకుండా లక్ష లీటర్ల నీటిని నిల్వచేసేందుకు ఏర్పాటుచేసిన అల్యూమినియం ట్యాంక్‌ను పరిశీలించారు. సమీక్షలో దేవస్థానం ఈవో వీర్ల సుబ్బారావు, చైర్మన్ రోహిత్, ఆర్జేసీ త్రినాధరావు, లోవ దేవస్థానం ఈవో విశ్వనాధరాజు పాల్గొన్నారు. అంతకముందు సత్యదేవుడిని దర్శించుకున్న ఆయనకు ఆలయ ఈవో, చైర్మన్‌లు ఘనస్వాగతం పలకగా వేదపండితులు వేదాశీర్వచనాలు అందజేశారు.

ఆసుపత్రి నుంచి ఆగమ పాఠశాల విద్యార్థుల డిశ్చార్జి


అన్నవరంలో వేద విద్యార్థులతో మాట్లాడుతున్న దేవదాయ కమిషనర్

తునిరూరల్/అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): తీవ్ర అస్వస్థతతో కాకినాడ జిల్లా తుని ఏరియా ఆసుపత్రిలో చేరిన అన్నవరం దేవస్థానం స్మార్త ఆగమ పాఠశాల విద్యార్థులు 11 మంది శుక్రవారం డిశ్చార్జి అయ్యారు. ఆగమ పాఠశాలకు మధ్యాహ్నం సురక్షితంగా చేరుకున్నారు. మంత్రి ఆనం రామనారాయణ విద్యార్థులతో ఫోన్‌లో మాట్లాడారు. విద్యార్థుల అస్వస్థతకు గల కారణాలను మంత్రి ఫోన్ ద్వారా ఆలయ అధికారులను అడిగినట్టు తెలుస్తోంది. దేవదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్ విద్యార్థులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. వారికి కావల్సిన సౌకర్యాలను తక్షణమే అందించాలని అన్నవరం దేవస్థానం ఈవో సుబ్బారావు విభాగ అధికారులకు సూచించారు. విద్యార్థుల పట్ల నిర్లక్ష్యం వహించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఘనంగా చండీహోమం


పూర్ణాహుతి గావిస్తున్న పండితులు

అన్నవరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): రత్నగిరి క్షేత్రరక్షకిగా పూజలందుకుంటున్న వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ, సప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్రహోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

తప్పిన పెను ప్రమాదం

బోల్తా కొట్టిన నాఫ్తా ట్యాంకర్‌ను సురక్షితంగా పైకి తీసిన ఓఎన్జీసీ సిబ్బంది


బోల్తా కొట్టిన ఓఎన్జీసీ ట్యాంకర్‌ను పైకి లేపుతున్న ఓఎన్జీసీ, ఫైర్ సిబ్బంది

ముమ్మిడివరం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం మండలం దొమ్మేటిపారివాలెం వద్ద పెను ప్రమాదం తప్పింది. నాఫ్తాను తీసుకెళ్తూ బోల్తా కొట్టిన ఓఎన్జీసీ ట్యాంకర్‌ను శుక్రవారం ఉదయం భారీ క్రేన్ సహాయంతో పైకి లేపడంతో అంతా ఊపిరిపీల్చుకున్నారు. తాటిపాక ఓఎన్జీసీ సైట్ నుంచి సుమారు 29వేల లీటర్ల నాఫ్తా చెన్నైకు తీసుకెళ్తుండగా ముమ్మిడివరం నగర పంచాయతీ బైపాస్ రోడ్డులోని దొమ్మేటిపారివాలెం వద్ద గురువారం అర్ధరాత్రి అదుపు తప్పి బోల్తా కొట్టింది. వెంటనే ముమ్మిడివరం ఎస్ఐ డి.జ్వాలాసాగర్ ఓఎన్జీసీ అధికారులకు సమాచారం అందించారు. అక్కడ ఫైర్ ఇంజన్లు, అంబులెన్సులను సిద్ధం చేశారు. ట్రాఫిక్‌ను ముమ్మిడివరం మీదుగా మళ్లించి ఘటనా స్థలానికి వంద మీటర్ల మేర ప్రజల్ని ఖాళీ చేయించారు. ముందుజాగ్రత్త చర్యల్లో భాగంగా 2 అంబులెన్సులు ముమ్మిడివరం, అమలాపురం ఫైర్ ఇంజన్లతో పాటు ఓఎన్జీసీకి చెందిన మరో 2 ఫైర్ ఇంజన్లు, 4 క్రేన్‌లను సిద్ధం చేశారు. ఓఎన్జీసీ సెక్యూరిటీ ఆఫీసర్ బలరామ్ సిబ్బందితో చేరుకుని ట్యాంకర్ క్యాప్ నుంచి లీకవుతున్న నాఫ్తాను అదుపుచేసి ట్యాంకర్‌ను నిలబెట్టే ప్రయత్నం చేశారు. చిన్న క్రేన్లతో సాధ్యకాకపోవడంతో భారీ క్రేన్‌ను తీసుకువచ్చి ఫోమ్ పిచికారీ చేస్తూ 3 గంటల పాటు శ్రమించి ఉదయం 7.30 గంటల సమయంలో పైకి లేపారు. ట్యాంకర్ డ్రైవర్ స్వల్పంగా గాయపడ్డాడు. ట్యాంకర్‌లో ఉన్న నాఫ్తా సుమారు 2వేల లీటర్లు నేల పాలు అయింది. నాఫ్తా గాలిలో కలిసి వెంటనే ఫైర్ అయ్యే స్వభావం ఉంది. దీంతో చుట్టుపక్కల వారిని ఖాళీ చేయించి అటుగా వాహనాల రాకపోకలు సాగించకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అక్కడ విద్యుత్ సరఫరాను కూడా నిలిపివేయించారు. ఫైర్, ఓఎన్జీసీ సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ చేసి ట్యాంకర్‌ను సురక్షితంగా పైకి లేపారు. దీంతో అధికారులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. బోల్తా కొట్టిన ట్యాంకర్‌కు మరమ్మతులు చేసి అక్కడినుంచి తరలించారు.

తప్పిపోయిన బాలుడు తల్లిదండ్రులకు అప్పగింత



తప్పిపోయిన బాలుడిని తల్లిదండ్రులకు అప్పగిస్తున్న పోలీసులు

తాళ్లరేవు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి తప్పిపోయిన 12 ఏళ్ల బాలుడిని శుక్రవారం పోలీసులు తల్లిదండ్రులకు అప్పగించారు. కాకినాడ జిల్లా తాళ్లరేవు మండలం నీలపల్లి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్న శ్రీరామ్ (12) తప్పిపోవడంతో అతడి నానమ్మ మందపల్లి వీరమ్మ కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేసింది. అదనపు ఎస్ఐ సత్యనారాయణ ఆధ్వర్యంలో పోలీసుల బృందం తక్షణం స్పందించి 6గంటల సమయంలో బాలుడి ఆచూకీ కనిపెట్టి కుటుంబ సభ్యులకు అప్పగించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ధన్యవాదాలు తెలియజేశారు.

కానిస్టేబుల్ ఫలితాల్లో 'శ్యామ్' విద్యార్థుల ప్రతిభ

కార్పొరేషన్/కాకినాడ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): పోలీసు కానిస్టేబుల్స్ 2025 ఫలితాల్లో కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించారు. శుక్రవారం శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించిన చైర్మన్ జి.శ్యామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పోలీసు రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా ప్రకటించిన పోలీసు కానిస్టేబుల్స్ ఫలితాల్లో తమ విద్యార్థులు 67శాతం విజయంతో ప్రభంజనం సృష్టించారన్నారు. సివిల్ కానిస్టేబుల్స్ విభాగంలో జి.నానాజీ(విశాఖ), మహిళా విభాగంలో రమ్యమాధురి(విజయనగరం), అలాగే ఏపీఎస్పీ విభాగంలో ఎం.అచ్యుతరావు(విశాఖ) స్టేట్ ఫస్ట్ ర్యాంకు సాధించడం ఇనిస్టిట్యూట్‌కే గర్వకారణమన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలు కలిపి 6014 ఉద్యోగాలకు ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు 4005కు పైగా ఉద్యోగాలను తమ ఇనిస్టిట్యూట్ ద్వారా ఆఫ్‌లైన్, ఆన్‌లైన్ కోచింగ్ టెస్ట్ సిరీస్, మెటీరియల్ ప్రోగ్రాం ద్వారా విద్యార్థులు విజయం సాధించారని తెలిపారు.

మంచి విజయం సాధించా



నా పేరు మేరుగ అచ్యుతరావు. నాది అనకాపల్లి జిల్లా అచ్యుతాపురం మండలం పూడిమడక గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 144.5 మార్కులతో ఏపీఎస్పీ విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. మా నాన్న సముద్రంలో చేపల వేటకు వెళ్తాడు. అమ్మ కూలీ పనికి వెళ్లి రోజుకు రూ.400 సంపాదించి ఇంటిని చూసుకుంటుంది. చోడవరం ఆఫ్‌లైన్ సెంటర్‌లో శ్యామ్ ఇనిస్టిట్యూట్ సండే మోడల్ టెస్‌లు రాస్తూ, గ్రౌండ్ స్కోర్ ఎక్కువతో మంచి విజయాన్ని సాధించాను.

విజయం అంకితం



నా పేరు గొర్లి రమ్యమాధురి. మాది విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం గడసాం గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 159 మార్కులతో మహిళల విభాగంలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. అమ్మే చదివించింది. నా విజయంలో అమ్మ, అన్నయ్యలతో పాటు స్నేహితులు పాలు పంచుకున్నారు. శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆఫ్‌లైన్ మోడల్ టెస్ట్ సిరీస్ విజయనగరం సెంటర్‌లో రాసేదాన్ని.

ఆ ముగ్గురే కారణం



నా పేరు గండి నానాజీ. విశాఖపట్నం జిల్లా అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామం. కానిస్టేబుల్ ఫలితాల్లో 168 మార్కులతో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించాను. నాన్న మేకలకాపరి. అమ్మ వ్యవసాయ కూలీ. అన్నయ్య ఎలక్ట్రికల్ వర్కర్‌గా పని చేస్తున్నాడు. అమ్మ, నాన్న, అన్నయ్య కష్టమే ఈ రోజు నేను స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించడానికి ముఖ్య కారణం.

ఆర్మీ ర్యాలీ, హాకీ టోర్నీలకు రూ.90వేలు విరాళం


కలెక్టర్ షాన్‌మోహన్‌కు చెక్కు అందిస్తున్న నారాయణ విద్యాసంస్థల ప్రతినిధులు

కలెక్టరేట్ (కాకినాడ), ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో ఆర్మీ రిక్రూట్‌మెంట్ ర్యాలీ, జాతీయ జూనియర్ మహిళల హాకీ చాంపియన్‌షిప్ నిర్వహణకు కాకినాడ నారాయణ విద్యాసంస్థలు రూ.90వేలు విరాళం ఇచ్చాయి. ఈ కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్‌కు విరాళం చెక్కును డీజీఎం ఎస్‌డీవీ కృష్ణ, ఏజీఎం కె.రాఘవేంద్రరావు శుక్రవారం అందజేశారు. డీఐఈవో శారద, సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అతి పెద్ద రాజకీయ కుట్ర : రత్నాకర్

కాకినాడ సిటీ, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): దళితుల ఐక్యతపై ఎస్సీ వర్గీకరణ దేశ చరిత్రలో అతి పెద్ద రాజకీయ కుట్ర అని మల మహానాడు (రాక్స్) జాతీయ అధ్యక్షుడు ఆర్ఎస్ రత్నాకర్ విమర్శించారు. కాకినాడలోని తన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్గీకరణ వల్ల వందలో నలుగురికే లబ్ధి చేకూరుతుందన్నారు. ఈ ఫలాలను దేశవ్యాప్తంగా ఎస్సీ జాబితాలో ఉన్న 1,108 ఎస్సీ కులాలకు ప్రధాని మోదీ ఎలా పంచుతారన్నారు. తెలుగు రాష్ట్రాల్లోని 59 ఎస్సీ కులాలకు ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి ఎలా ప్రయోజనం చేకూర్చగలరన్నారు. మాల సామాజికవర్గీయులంతా శాంతియుత పోరాటానికి సిద్ధం కావాలని కోరారు.

జలకళ

నిండిన సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలు


నిండుగా ఉన్న డొంకరాయి జలాశయం

మోతుగూడెం, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న వర్షాలతో సీలేరు కాంప్లెక్స్ పరిధిలోని జలాశయాలు నీటితో కళకళలాడుతున్నాయి. జలాశయాలకు సుమారు 14 టీఎంసీల నీరు చేరిందని జెన్‌కో అధికారులు లెక్కగడుతున్నారు. బలిమెల జలాశయానికి సుమారు 11టీఎంసీలు చేరినట్టు తెలిపారు. ఏపీపీ డ్యాం, డొంకరాయి జలాశయానికి సుమారు 7వేల క్యూసెక్కుల చేరుతుండటంతో నీటి మట్టం క్రమేపీ పెరుగుతోంది. సీలేరుకు 1500క్యూసెక్కులు, బలిమెల జలాశయానికి సుమారు 9500 క్యూసెక్కులు వస్తున్నాయి. జోలాపుట్, బలిమెలలో ప్రస్తుతం ఉన్న 45.90 టీఎంసీల్లో 25.39టీఎంసీలు ఆంధ్రా వాటాగా ఉంది. డొంకరాయి, గుంటవాడ జలాశయాల్లో ప్రస్తుతం ఉన్న 9.71టీఎంసీలతో కలిపి మన రాష్ట్రం వాటాగా 35.10 టీఎంసీల నిల్వలు ఉన్నట్టు జెన్‌కో అధికారులు తెలిపారు. లోడ్ డిస్పాచ్ సెంటర్ ఆదేశాల మేరకు సీలేరు కాంప్లెక్స్‌లోని అన్ని విద్యుత్తు కేంద్రాల్లో నిరాటంకంగా ఉత్పత్తి కొనసాగిస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 9.36 మిలియన్ యూనిట్ల విద్యుత్పత్తి జరుగుతోంది.

అయస్కాంతం ముక్క మింగిన బాలిక

తొలగించిన వైద్యులు


వైద్యులు తొలగించిన ముక్క

ప్రత్తిపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం బురద కోట గిరిజన తండాకు చెందిన మాడెం రమ్య 1వ తరగతి విద్యార్థిని రింగ్ ప్యాకెట్‌లో ఉన్న అయస్కాంతం ముక్కను మింగేసింది. దీంతో బాలికను కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా ముక్కను వైద్యులు తొలగించారు. బురదకోట సమీపంలోని బాపన్నధారకు చెందిన మాడెం రమ్య బురదకోటలోని గిరిజన ప్రభుత్వ పాఠశాలలో 1వ తరగతి చదువుతుంది. అయితే రింగ్ ప్యాకెట్లు తినే అలవాటు ఉన్న బాలిక ఆ ప్యాకెట్‌లో తినుబండారాలతో పాటు అయస్కాంతం ముక్కను కూడా మింగేసింది. దీంతో బాలికను ప్రత్తిపాడు, ఏలేశ్వరంలోని ప్రైవేట్ ఆసుపత్రులకు తరలించినప్పటికీ అయస్కాంతం తొలగించే సదుపాయాలు లేవని కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా శుక్రవారం వైద్యులు అయస్కాంతం ముక్కను తొలగించారు. ఈ అంశంపై సంబంధిత రింగ్ కంపెనీపై న్యాయ పోరాటం చేస్తామని బాలిక తల్లిదండ్రులు తెలిపారు.


ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలిక

పింఛన్ల సొమ్ము దుర్వినియోగం

ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ

ప్రత్తిపాడు, ఆగస్టు 1 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల సొమ్ము రూ.14లక్షలు దుర్వినియోగం చేశారు. మూడేళ్లుగా లబ్ధిదారులకు చెల్లించకుండా మిగిలిన సొమ్మును ఖజానాకు జమ చేయకుండా వ్యక్తిగత అవసరాల కోసం వినియోగించారు. దీంతో ఈ వ్యవహారంపై ప్రత్తిపాడు ఎంపీడీవో ఐదుగురు సచివాలయ సిబ్బందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలో పింఛన్ల నిమిత్తం 11,539 మందికి రూ.5,05,47500 నెలవారీ ఖర్చు చేస్తున్నారు. అయితే ప్రతి నెలా పలు కారణాల వల్ల కొంత సొమ్ము సచివాలయ సిబ్బంది వద్ద నిలిచిపోతుంది. 2021 నుంచి 2024 మధ్యలో ఈ విధంగా రూ.30లక్షల వరకు మిగిలిన సొమ్ములు సచివాలయ ఉద్యోగుల వద్దే ఉండిపోయాయి. వీటిని వెనువెంటనే స్థానిక ఖజానా కార్యాలయంలో జమ చేయాల్సి ఉన్నప్పటికీ నిబంధనలు పట్టించుకోకుండా సచివాలయ ఉద్యోగులు సొంత అవసరాలకు వాడుకోవడం విషయం బయటకు పొక్కింది. ఈ క్రమంలో రూ.16లక్షల వరకు గతంలో ఎంపీడీవో ఎంవీఆర్ కుమార్‌బాబు రికవరీ చేసి ఖజానాకు జమ చేయించారు. అయితే ఇంకా రూ.14 లక్షల వరకు సచివాలయ ఉద్యోగుల వద్ద ఉండిపోవడంతో ఎంపీడీవో జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఐదుగురు సచివాలయ ఉద్యోగులకు నోటీసులు జారీ చేశారు. వీటిలో గోకవరం పంచాయతీకి చెందిన రూ.2,03,250, చినశంకర్లపూడికి చెందిన రూ.7,46,250, గజ్జనపూడికి చెందిన రూ.45వేలు, ధర్మవరానికి చెందిన రూ.1,90,250, ఒమ్మంగి పంచాయతీకి చెందిన రూ.3.75లక్షలు పింఛన్ల పంపిణీ సొమ్ము తిరిగి ప్రభుత్వ ఖాతాకు జమ చేయాల్సి ఉంది. దీంతో నిధులు దుర్వినియోగం చేసినట్టు భావించి ఐదుగురు సచివాలయ వెల్ఫేర్, ఎడ్యుకేషన్ అసిస్టెంట్లకు షోకాజ్ నోటీసులను ఎంపీడీవో జారీ చేశారు. 24 గంటలోపు రూ.14లక్షలు ఖజానాకు జమ చేసి రసీదును ఎంపీడీవో ఆఫీసులో అందజేయాలనిఆదేశించారు.



రాయి.. చూసుకువెళ్లవోయ్!

కాకినాడ రామారావు పేట ప్రకాశం వీధిలో రోడ్డు మధ్య భాగాన గుంత పడింది. దీంతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతారని స్థానికులు పెద్ద రాయిని ఏర్పాటు చేశారు.
–స్టాఫ్ ఫొటోగ్రాఫర్, కాకినాడ

నవోదయలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

యానాం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి):యానాం మెట్టకుర్రులోని జవహర్ నవోదయ విద్యాలయంలో ప్రవేశ పరీక్ష లేకుండా ఇంటర్ ప్రథమ సంవత్సరంలో చేరేందుకు ఈనెల10వలోగా యానాం ప్రాంత అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ శ్రీపాద శరత్‌చంద్రకీర్తి తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సుల్లో చేరాలన్నారు.

హామీలను అమలుచేస్తోన్న ప్రభుత్వం



అంతర్వేది దేవస్థానంలో పెన్షన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్







మామిడికుదురు: మొగలికుదురులో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, ఐ.పోలవరం: మురమళ్ళలో పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు, అమలాపురం: ఈదరపల్లిలో నూతన వితంతు పింఛన్ పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే ఆనందరావు

- ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ
- జిల్లాలో పింఛన్ల పంపిణీ

మామిడికుదురు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం ఒక్కొక్కటిగా అమలుచేస్తోందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. మొగలికుదురులో ప్రభుత్వం నుంచి మంజూరైన వితంతు పెన్షన్లను శుక్రవారం ఆయన పంపిణీ చేశారు. పాశర్లపూడిలో అమలాపురం ఆర్డీవో కె.మాధవి, మగటపల్లిలో జడ్పీ మాజీ చైర్మన్ నామన రాంబాబు, మామిడికుదురులో సర్పంచ్ గౌస్ మొహిద్దీన్ తదితరులు పెన్షనున్ల పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో ఏఎంసీ చైర్మన్ పెనుమాల లక్ష్మి, టీడీపీ, జనసేన, బీజేపీ మండలశాఖల అధ్యక్షులు మొల్లేటి శ్రీనివాస్, జాలెం శ్రీనివాసరాజా, భైరిశెట్టి రామకృష్ణ, నాయకులు ఈలి శ్రీనివాస్, బోనం బాబు, మల్లాడి విష్ణు, దొంగ సత్తిబాబు, సర్పంచ్‌లు అడబాల తాతకాపు, కడి అరుణకుమారి, తెలగారెడ్డి సూర్యప్రకాశరావు తదితరులు పాల్గొన్నారు.

పి.గన్నవరం, (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 736మందికి కొత్త పింఛన్లు మంజూర య్యాని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ తెలిపారు. నాగుల్లంకలో కొత్తగా మంజూరైన పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. అర్హులందరికీ సంక్షేమ ఫలాలు అందుతాయని, వైసీపీ కల్లబొల్లి మాటలు నమ్మవద్దన్నారు. ఈనెల15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రభుత్వం ప్రారంభిస్తుందని తెలిపారు. ఇన్‌చార్జి ఎంపీడీవో జి.ఉమామహేశ్వరరావు, గ్రామ సర్పంచ్ యల్లమిల్లి కృష్ణవేణి, దాసరి వీరవెంకటసత్యనారాయణ, వాసంశెట్టి కుమార్, ఆదిమూలం సూరయ్యకాపు, పాలూరి ఫణి, గనిశెట్టి శ్రీనివాసరావు, పత్తిపాటి వెంకన్నబాబు, అర్థాని ఏడుకొండలు, నూకల విశ్వేశ్వరరావు, బొక్కా రెడ్డి, గనిశెట్టి శ్రీనివాసరావు, ఏసుదాసు పాల్గొన్నారు.

ముమ్మిడివరం, (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో శుక్రవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్లు పంపిణీ చేశారు. అయినాపురంలో తహశీల్దార్ టి.సుభాష్, వ్యవసాయశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ జి.గోపి, మట్ట సత్తిబాబు, బొంతు నాగరాజు, సబ్బతి డేవిడ్ రాజు, కోరశిక రాము, యనమదల సుబ్బారావు, సానబోయిన శ్రీనివాసరావు పాల్గొని 21ఎన్టీఆర్ పింఛన్లు, 21కొత్త వితంతు పింఛన్లు పంపిణీ చేశారు. మండలంలో 6842పింఛన్లు ఉండగా కొత్తగా 120వితంతు పింఛన్లు మంజూరయ్యాయి. 95శాతం శుక్రవారం పంపిణీ చేసినట్టు ఎంపీడీవో తాడి శ్రీవెంకటాచార్య తెలిపారు. నగరపంచాయతీలో 3018 పింఛన్లు ఉండగా కొత్తగా 37పింఛన్లు మంజూరయ్యాయన్నారు. సీహెచ్ గున్నేపల్లిలో పింఛన్ల పంపిణీలో సర్పంచ్ గొలకోటి దొరబాబు, బీజేపీ నాయకులు గొలకోటి వెంకటరెడ్డి, జనసేన పార్టీ నాయకుడు గాలిదేవర బుల్లి, యాళ్ల ఉదయ్, గొలకోటి భాస్కరరామూర్తి, గాలిదేవర నాగేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శి ఇందుప్రియ, వెల్ఫేర్ అసిస్టెంట్ లక్ష్మీప్రియ పాల్గొన్నారు. ముమ్మిడివరం 16,17వార్డుల్లో పింఛన్ల పంపిణీలో టీడీపీ జిల్లా ఉపాధ్యక్షుడు తాడి నరసింహారావు, రెడ్డి సుబ్బారావు, ననుబోలు శ్రీనివాస్ పాల్గొన్నారు. 96శాతం పింఛన్ల పంపిణీ పూర్తయినట్టు కమిషనర్ పి.రవివర్మ తెలిపారు. గ్రామాల్లో పింఛన్ల పంపిణీలో కూటమి నాయకులు, సర్పంచ్‌లు, అధికారులు పాల్గొన్నారు.

మలికిపురం, (ఆంధ్రజ్యోతి): మలికిపురం మండలంలో వితంతు కొత్త పింఛన్లు 160 మంజూరైనట్టు ఎంపీడీవో సుబ్రహ్మణ్యం తెలిపారు. శుక్రవారం మండల పరిధిలోని ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కూటమి సభ్యులు లబ్ధిదారులకు పింఛన్లు అందజేశారు.

ఐ.పోలవరం, (ఆంధ్రజ్యోతి): ముమ్మిడివరం నియోజకవర్గంలో కొత్తగా 772 వితంతు పింఛన్లు మంజూరైనట్టు ఎమ్మెల్యే దాట్ల బుచ్చిబాబు తెలిపారు. శుక్రవారం ఆయన మురమళ్ళలో కొత్త పింఛన్లు పంపిణీ చేశారు. కూటమి పాలనలో ప్రజలందరూ ఆనందంగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శర్మ, దాట్ల రామకృష్ణంరాజు. ఏలూరి మూర్తి, రాయపురెడ్డి మాణిక్యం, గంజా సుధాకర్, సలాది రాజా, కటారి నాని, సవరపు రమణ, దండు బాబు, పంచాయతీ కార్యదర్శి పి.రవిరాజు పాల్గొన్నారు.

రాజోలు, (ఆంధ్రజ్యోతి): పేదలకు ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గోదావరి సెంట్రల్ డెల్టాప్రాజెక్టు చైర్మన్ గుబ్బల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం పొన్నమండలో పెన్షనదారులకు ఆయన శుక్రవారం పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. రాజోలు నియోజకవర్గంలో 571మందికి వితంతు పెన్షన్లు మంజూరైనట్టు తెలిపారు. శనివారం అన్నదాత సుఖీభవ కింద రైతుల ఖాతాల్లో సొమ్ములు జమ చేస్తారన్నారు. టీడీపీ గ్రామశాఖ అధ్యక్షుడు దాకే ఏడుకొండలు, ఎంపీటీసీలు మోకా ఉష, కడలి దుర్గ, ఇంజనీరింగ్ అసిస్టెంట్ కె.జ్యోతి, మోకా ఏడుకొండలు, కడలి మోహన్, గుబ్బల నాగయ్య, యల్లమిల్లి సుధీర్, అప్పారి వీరవెంకటసత్యనారాయణ, మామిడిశెట్టి సత్యనారాయణ, బొక్కా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్న ఘనత సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌లకు దక్కుతుందని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ అన్నారు. పుల్లేటికుర్రు పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ జల్లి బాలరాజు ఆధ్వర్యంలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. మండలంలో కొత్తగా మంజూరైన 183 పింఛన్లను ఎమ్మెల్యే అందించారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ డైరెక్టర్ శిరిగినీడి వెంకటేశ్వరరావు, శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ బొంతు పెదబాబు, ఎంపీటీసీ పబ్బినీడి రాంబాబు, నాయకులు దాసరి వీరవెంకట సత్యనారాయణ, గణపతి వీరరాఘవులు, అరిగెల సూరిబాబు, కొర్లపాటి గోపి, మైపాల తాతాజీ, దొమ్మేటి సాయికృష్ణ, ఎంపీడీవో నరసింహం, డిప్యూటీ ఎంపీడీవో కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అమలాపురం రూరల్, (ఆంధ్రజ్యోతి): నూతనంగా మంజూరైన వితంతు పెన్షన్లను, ఎన్టీఆర్ భరోసా పెన్షన్లను శుక్రవారం అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు అమలాపురం పట్టణంతో పాటు మండల పరిధిలోని ఈదరపల్లి పేరూరు గ్రామాల్లో పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, డీసీఎంఎస్ చైర్మన్ పెచ్చెట్టి చంద్రమౌళి, ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొలమూరి ధర్మపాల్, టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు చొల్లంగి సత్యసాయిబాబా, మాజీ ఎంపీపీ బొర్రా ఈశ్వరరావు, మాజీ జడ్పీటీసీ అధికారి జయవెంకలక్ష్మి, నాయకులు మట్టా మహాలక్ష్మీప్రభాకర్, దేవరపల్లి వీరేష్‌కుమార్, ముత్తాబత్తుల సత్యనారాయణ, మొయిల శివ, ముత్తాబత్తుల రమణ, కురచ గోవిందు, మల్లవరపు ప్రసాద్, శంకరరావు, కార్యదర్శి కోడూరి వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అర్హులైన పేదలకు సంక్షేమ ఫలాలు అందిస్తుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. లక్ష వితంతు పెన్షన్లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. దేవస్థానం గ్రామ పంచాయతీ పరిధిలో ఎమ్మెల్యే దేవ వితంతు పెన్షన్లు శుక్రవారం పంపిణీ చేశారు. రాజోలు నియోజకవర్గ పరిధిలో 571 పెన్షన్లు మంజూరయ్యాయన్నారు. కూటమి ప్రభుత్వం మీకు ఎల్లప్పుడు అండగా ఉంటుందని భరోసా కల్పించారు.

వైభవంగా సామూహిక వరలక్ష్మీ వ్రతాలు





అంతర్వేది: వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహింపచేస్తున్న అర్చకులు, వ్రత పూజల్లో పాల్గొన్న మహిళలు

అమలాపురం టౌన్/రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణ శుక్రవారం వరలక్ష్మీ కటాక్షం కోసం అమలాపురం పట్టణ పరిసర గ్రామాల్లోని ఆలయాల్లో వందలాది మంది మహిళలు సామూహిక పూజలు నిర్వహించారు. అమలాపురం శ్రీకామాక్షీ పీఠంలో అష్టలక్ష్మీ పరదేవతా పూజలను పీఠం ఉత్తరాధికారి విఖనస రాఖీ ప్రేమ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. వందలాది మంది మహిళలు తెల్లవారుజాము నుంచి తరలివచ్చి భక్తితో పూజలు నిర్వహించారు. రాహుకాలంలో నిమ్మ డిప్పల్లో దీపాలు వెలిగించారు. ఈనెల8,15,22 తేదీల్లో శుక్రవారం రోజున ఇదే తరహాలో పూజలు జరుగుతాయని పీఠం ఉత్తరాధికారి తెలిపారు. అమలాపురం శ్రీచంద్రమౌళీశ్వరస్వామివారి ఆలయంలో విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు నిర్వహించారు. వందలాది మంది మహిళలు వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షురాలు భమిడిపాటి శ్రీలక్ష్మి, దేవస్థానం ట్రస్టీలు కూచిమంచి నాగమణి, సుజాత, సంధ్యారాణి, ఏలూరిపాటి సరోజ, పుత్సా రాజేశ్వరి, బులుసు విజయలక్ష్మి, విశాల, జయంతి చిత్ర, కేదారిశెట్టి అపర్ణారాణి, ఓలేటి కామేశ్వరి, బొంతు లక్ష్మి, యర్రంశెట్టి రమాదేవి తదితరులు పాల్గొనగా ఆపస్తంభ పురోహిత పరిషత్ అధ్యక్షుడు గొర్తి వెంకటకృష్ణ సత్యసాయి మహిళలతో సామూహిక వరలక్ష్మీ వ్రతాలు ఆచరించారు. బండారులంక శ్రీభువనేశ్వరి సమేత త్రయంబకేశ్వరస్వామి ఆలయంలో భువనేశ్వరి అమ్మవారికి అష్టద్రవ్య అభిషేకాలు నిర్వహించారు. 108స్వర్ణ పుష్పాలతో పూజలు చేశారు. గుమ్మిడి సద్గురు సత్యనారాయణ పౌరోహిత్యంలో శ్రీశైలం దేవస్థానం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి-చంద్రకళ దంపతులు కర్తలుగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేశారు. చింతా అత్తిలింగం సోదరులు మహిళలకు పసుపు, కుంకుమ, చీరలు అందజేశారు. భట్నవిల్లి శ్రీవిజయదుర్గమ్మవారి ఆలయం వద్ద మహిళలు సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు.

అంతర్వేది, (ఆంధ్రజ్యోతి): అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామిఆలయంలో సామూహిక వరలక్ష్మీ వ్రత పూజలు వైభవంగా జరిగాయి. తొలుత స్వామివారి ఆలయంలో శ్రీరాజ్యలక్ష్మి తాయారు అమ్మవారి సన్నిధిలో శ్రావణమాస రెండో శుక్రవారం మహిళలు సామూహిక వరలక్ష్మీవ్రత పూజలు చేశారు. ఉచితంగా పూజా సామగ్రి అందించారు. ఆలయమంతా భక్తులతో కిటకిటలాడింది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు స్వామివారి దర్శనం అనంతరం అన్నదానంలో అన్నప్రసాదం అందించారు.

అంతర్వేది ఆలయ అభివృద్ధిపై సమీక్ష

అంతర్వేది, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా విరాజిల్లుతున్న అంతర్వేది పుణ్యక్షేత్రానికి మహర్దశ పట్టనుందని ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ అన్నారు. ఆలయ భూములు, అభివృద్ధిపై మండల అధికారులు, రెవెన్యూ, దేవదాయశాఖ, కూటమి నాయకులతో సమీక్షా సమావేశం ఆలయ ప్రాంగణంలో శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే దేవ మాట్లాడుతూ స్వామివారి కోనేరు నిర్మాణానికి అవసరమైన నిధులకు దేవదాయశాఖ అధికారులతో చర్చిస్తామన్నారు. నీలకంఠేశ్వరస్వామి ఆలయ పునఃనిర్మాణం కోసం మ్యాచింగ్ గ్రాంట్ కోసం త్వరలో నిర్ణయం తీసుకుంటామన్నారు. లక్ష్మీనరసింహస్వామి ఆలయ వెనుక భాగంలో 34.60సెంట్ల భూమిలో తొలుత పది సెంట్ల భూమిని మెరక చేసేందుకు చర్యలు తీసుకుంటామని, ఆర్చిగేటు నిర్మాణానికి స్వామివారి ఆభరణాల దాత దివంగత పోతురాజు సూర్యవెంకటసత్యనారాయణ కుమారుడు లక్ష్మీనారాయణ (లచ్చికొండ) ముందుకు వచ్చారన్నారు. గుర్రాలక్కమ్మ ఆలయ నిర్మాణానికి అవసరమైన భూమిని ముందుగా సర్వే చేయించి రైతులతో సమావేశం ఏర్పాటు చేయాలని తహశీల్దార్, ఏసీ ప్రసాద్‌ను ఆదేశించారు. స్వామివారి పాత రథ శకలాలను తొలగించే విషయమై జిల్లా ఎస్పీతో మాట్లాడి పది రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ఏసీ ఎంకేటీఎన్వీ ప్రసాద్, దిరిశాల బాలాజీ, ముప్పర్తి నాని, ఆకన బాబ్జినాయుడు, భైరా నాగరాజు, పొన్నాల ప్రభ, తహశీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో సూర్యనారాయణ, ఎంపీపీ వీరా మల్లిబాబు, పోతురాజు కృష్ణ, కూటమి నాయకులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో ఆహారాన్ని అందించాలి



కమిషనర్, సిబ్బందికి సూచనలిస్తున్న కలెక్టర్

ముమ్మిడివరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేదల ఆకలిని తీర్చేందుకు అక్షయపాత్ర, అన్న క్యాంటీన్లు నాణ్యతా ప్రమాణలు గల ఆహారాన్ని సమయ పాలన పాటిస్తూ అందించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్‌కుమార్ ఆదేశించారు. ఐవీఆర్ఎస్ కాల్‌సెంటర్‌లో సిటిజన్ ఫీడ్ బ్యాక్‌లో 24శాతం మంది అన్న క్యాంటీనులో భోజనం రుచిగా ఉండడం లేదని చేసిన ఫిర్యాదుల మేరకు ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ శుక్రవారం ముమ్మిడివరం బళ్లగేటు సెంటర్‌లోని అన్నక్యాంటీన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆహారం కోసం క్యాంటీన్‌కు వచ్చిన వారితో ఆయన మాట్లాడారు. సమయానికి ఆహారం తీసుకుఇస్తున్నారా, పదార్థాల నాణ్యత ఎలా ఉంది, ఇబ్బందులు ఏమైనా ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. అక్కడికి వచ్చిన వారు క్యాంటీనులోని భోజనం ఇంట్లోని భోజనంలా ఉంటుందని సంతృప్తి వ్యక్తం చేశారు. భోజనానికి వచ్చే వారికి ఏవిధమైన అసౌకర్యం కలగకుండా మర్యాద పూర్వకంగా రుచిగా శుచిగా భోజనం అందించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహశీల్దార్ పి.సుభాష్, టౌన్‌ప్లానింగ్ అధికారి రాజేష్‌బాబు, అసిస్టెంట్‌ఇంజనీర్ శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు.

పాఠశాలలో కనీస వసతులు కల్పించాలి

యానాం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): యానాం శివారు గిరియంపేటలోని పెరుంతలైవార్ కామరాజర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కనీస వసతులు కల్పించాలని కాంగ్రెస్ పార్టీ యానాం అధ్యక్షుడు ఆర్ధాని దినేష్ ఆరోపించారు. ఈసందర్భంగా పాఠశాలను సందర్శించి అక్కడ ఉన్న పరిస్థితులను పరిశీలించారు. కనీస సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సోషల్ సబ్జెక్టుకు ఉపాధ్యాయుడు లేకపోవడం, మరుగుదొడ్లు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మెల్లం చిన్నా, గణేష్, అరుణ్‌కుమార్, ఆదిమూర్తి, సింహాద్రి, అశోక్, మల్లేశ్వరరావు, బన్నీ పాల్గొన్నారు.

సీనియార్టీని పరిగణలోకి తీసుకోవాలి



డీఈవోకు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

ముమ్మిడివరం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మండల విద్యాశాఖాధికారుల నియామకంలో కేవలం ప్రభుత్వ మేనేజ్‌మెంట్ స్కూలు అసిస్టెంట్లను ఎఫ్‌ఏసీలుగా నియమించడం పట్ల పీఆర్టీయూ, ఏపీయుఎస్ ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం నల్లబ్యాడ్జీలు ధరించి చాక్‌డౌన్ కార్యక్రమం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. ఎంఈవో-1 (ఎఫ్ఏసీ)గా ప్రభుత్వ మేనేజ్‌మెంట్ పాఠశాలల స్కూలు అసిస్టెంట్‌లకు మాత్రమే అవకాశం కల్పించడం వల్ల సీనియారిటీ కలిగిన పంచాయతీరాజ్ ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతుందని ఆయా సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కామన్ సినియారిటీ ప్రాతిపదికన మండల విద్యాశాఖాధికారులుగా నియామకాలు చేపట్టాలని కోరుతూ డీఈవో సలీంబాషాకు వినతిపత్రం అందించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సురేష్‌బాబు, రాష్ట్ర కార్యదర్శి కె.చంద్రశేఖర్, రాష్ట్ర కౌన్సిలర్ యెరుబండి సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి పద్మనాభం, అప్పారి రామకృష్ణ, తోట వెంకటేశ్వరరావు, మట్టా శ్రీనివాస్, ఏపీయుఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పెచ్చెట్టి సురేష్, గన్నవరపు అమ్మిరాజు తదితరులు పాల్గొన్నారు.

బస్‌కాంప్లెక్స్‌ను సందర్శించిన ఆర్డీవో

రాజోలు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ రాజోలు బస్ కాంప్లెక్సును అమలాపురం ఆర్డీవో కె.మాధవి శుక్రవారం సందర్శించారు. రాష్ట్ర ప్రభుత్వం స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 15నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం గురించి, ప్రయాణికుల మౌలిక సదుపాయాల ఏర్పాట్లపై ఆర్టీసీ డీఎం పి.ధనమ్మను ఆర్డీవో వివరాలు అడిగి తెలుసుకున్నారు. కాంప్లెక్సులో తాగునీరు, బాత్‌రూమ్, పార్శిల్ కౌంటర్లను పరిశీలించారు. బస్సు కాంప్లెక్సు ఆవరణ అంతా చెత్త లేకుండా పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. తహశీల్దార్ సీహెచ్ భాస్కర్, ఎంపీడీవో కె.వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో వి.శ్రీనివాస్, సెక్రటరీ రెహ్మాన్ పాల్గొన్నారు.

పిల్లల సంఖ్య పెంచేందుకే మధ్యాహ్న భోజన పథకం

'లక్ష్యాలకు తూట్లు పొడుస్తున్న కేంద్ర బడ్జెట్'



మధ్యాహ్న భోజన పథకం కార్మికుల నూతన జిల్లా కమిటీతో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి

అమలాపురం రూరల్, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బడికి వచ్చే పిల్లల సంఖ్యను పెంచడంతో పాటు డ్రాపౌట్లను తగ్గించేందుకు ఎంతో మంచి లక్ష్యంతో మధ్యాహ్న భోజన పథకాన్ని ప్రారంభించారని మధ్యాహ్నభోజన పథకం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దయా రమాదేవి పేర్కొన్నారు. కానీ కేంద్ర ప్రభుత్వం లక్ష్యాలకు తూట్లు పొడుస్తూ బడ్జెట్‌ను ప్రతీ ఏటా తగ్గిస్తుందని విమర్శించారు. మధ్యాహ్న భోజన పథక కార్మికుల జిల్లాస్థాయి విస్తృత సమావేశం అమలాపురం ఎంప్లాయీస్ హోంలో జిల్లా కన్వీనర్ సీహెచ్ లోవలక్ష్మి అధ్యక్షతన శుక్రవారం జరిగింది. ముఖ్యఅతిథిగా రమాదేవి మాట్లాడుతూ భోజనపథకం కార్మికులకు రూ.10వేలువేతనం ఇవ్వాలన్నారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి కె.కృష్ణవేణి మాట్లాడారు. అనంతరం జిల్లా కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.జిల్లాశాఖ గౌరవాధ్యక్షురాలిగా కె.కృష్ణవేణి అధ్యక్షురాలిగా, ఎస్.బేబిసరోజిని, ప్రధాన కార్యదర్శిగా టి.నాగవరలక్ష్మి కోశాధికారిగా ఎస్.వెంకటలక్ష్మి, ఉపాధ్యక్షులుగా దుర్గ, కరుణ, సంయుక్త కార్యదర్శిగా లోవలక్ష్మి, విజయలక్ష్మితో పాటు 23మందితో కమిటీని ఎన్నుకోగా జిల్లాలోని మధ్యాహ్న భోజనపథకం కార్మికులంతా పాల్గొన్నారు.

నేడు గొల్లవిల్లిలో అన్నదాత సుఖీభవ పంపిణీ

ఉప్పలగుప్తం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గొల్లవిల్లి నిమ్మకాయల చినరాజప్ప కల్యాణ మండపంలో అమలాపురం నియోజకవర్గంలోని రైతు లబ్ధిదారులకు శనివారం అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ నిధులు పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు వ్యవసాయాధికారులు తెలిపారు. ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరుగుతుందన్నారు. నియోజకవర్గంలో 13,364మంది రైతులకు రూ.9.25లక్షలు పంపిణీ చేయనున్నట్టు ఎమ్మెల్యే తెలిపారు. అన్నదాత సుఖీభవ ద్వారా రూ.6.68కోట్లు, పీఎం కిసాన్ ద్వారా రూ.2.56కోట్లు మంజూరైనట్టు తెలిపారు. ఒక్కొక్క రైతుకు మొదటి విడతగా రూ.7వేలు ఖాతాల్లో జమచేస్తారన్నారు. కాగా ఉప్పలగుప్తం మండలంలో 4,212మంది రైతులకు అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ సహాయం అందనుంది.

తదేకం ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయం

అయినవిల్లి, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు సేవలు అందిస్తున్న తదేకం ఫౌండేషన్ సేవలు ప్రశంసనీయమని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ పేర్కొన్నారు. శుక్రవారం అయినవిల్లిలో ఎస్ఎస్‌వీఆర్ జూనియర్ కళాశాలలో 12మందికి, మహిళా డిగ్రీ కళాశాలలో చదువుతున్న సింగిల్ పేరెంట్ విద్యార్థులకు తదేకం ఫౌండేషన్, పౌరసరఫరాలశాఖ కార్పొరేషన్ డైరెక్టర్ కడలి ఈశ్వరి ఆధ్వర్యంలో సమకూర్చిన ఉపకార వేతనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ చిట్టూరి శ్రీనివాస్, కాకర శ్రీనివాస్, కడలి శివ, పోలిశెట్టి రాజేష్, మేడిద దుర్గాప్రసాద్, సలాది బుచ్చిరాజు, కముజు రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

గురుకుల కళాశాలలకు నిధులు కేటాయించాలి

అల్లవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ గురుకుల కళాశాలల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలని, పారిశుద్య చర్యలు మెరుగుపరిచి టీచింగ్ పోస్టులు భర్తీ చేయాలని దళిత ఐక్యవేదిక, పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం గోడి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బాలురు, బాలికల గురుకుల కళాశాలలను దళిత ఐక్యవేదిక, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘ నాయకులు శుక్రవారం సందర్శించారు. విద్యార్థుల బాత్‌రూమ్‌లను పెంచాలని, కిటీలకు మెస్‌లు ఏర్పాటు చేయాలని, సకాలంలో పుస్తకాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్‌ల పోస్టులు భర్తీ చేయాలన్నారు. దళిత ఐక్యవేదిక అధ్యక్షుడు డీబీ లోక్, ప్రధాన కార్యదర్శి ఇసుకపట్ల రఘుబాబు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రేవు తిరుపతిరావు, డీబీఎంఎస్ కన్వీనర్ కొంకి రాజామణి తదితరులు విద్యార్థుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

కనకదుర్గమ్మకు ప్రత్యేక పూజలు

అల్లవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): బెండమూర్లంకలో వేంచేసి ఉన్న విజయకనకదుర్గాదేవి అమ్మవారికి శుక్రవారం సామూహిక సహస్ర గాయత్రీ, లక్ష్మీ దీప యజ్ఞాలు నిర్వహించారు. మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్నారు. ఆకుల శ్రీదేవి, సాధనాల బాపనమ్మ, తోట దుర్గాభవానీ, కోటిపల్లి వెంకటేశ్వరి, గిడుగు భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా అబ్బులు ఖరారు



అమలాపురం, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): అమలాపురం పట్టణం మహిపాలవీధిలో వేంచేసి ఉన్న శ్రీదేవిభూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానం ఆలయ పాలకమండలి చైర్మన్‌గా పట్టణానికి చెందిన జనసేన సీనియర్ నాయకుడు, దేవస్థానం మాజీ చైర్మన్ కంచిపల్లి అబ్బులు పేరును ఖరారు చేశారు.ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు స్వగృహంలో జనసేన ముఖ్య నాయకులతో జరిగిన సమావేశంలో వెంకటేశ్వరస్వామి దేవస్థానం పదవికి అబ్బులు పేరును సిఫారసు చేసేందుకు నిర్ణయించారు. దీంతో చైర్మన్ పదవికి ఆయన పేరు ఖరారు కానుంది. ఇక పాలకవర్గ సభ్యుల నియామకంలో కసరత్తు పూర్తయిన తరువాత అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్ పదవికి సంబంధించిన ప్రకటన ప్రభుత్వం నుంచి వెలువడనున్నట్టు సమాచారం. 2011నుంచి రెండేళ్ల గతంలో చైర్మన్‌గా పనిచేసిన అనుభవం ఉన్న అబ్బులును మళ్లీ చైర్మన్ పదవి వరించనుండడంతో జనసేన పార్టీ శ్రేణుల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

వైభవంగా శ్రీమహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ

అయినవిల్లి, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): ఎస్.మూలపొలంలో నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీమహాగణపతి విగ్రహ ప్రతిష్ఠ వైభవంగా జరిగింది. మతుకుమిల్లి లక్ష్మణరావు దంపతులతో విగ్రహ ప్రతిష్ఠ జరిపించారు. గణపతిపూజ, పుణ్యవచనం, మండపారాధన, హోమాలు నిర్వహించారు. అన్నసమారాధన నిర్వహించారు. అముడాచైర్మన్ అల్లాడ స్వామినాయుడు, టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి మెట్ల రమణబాబు, కొరిపల్లి శ్రీనివాస్, కోనే రామకృష్ణారావు,జాన్సి శ్రీనివాసరావు, చిట్టూరి వీరవెంకటసత్యనారాయణచౌదరి, దాసరి నారాయణమూర్తి, మతుకుమిల్లి భరద్వాజ్, పృథ్వీ పాల్గొన్నారు.

రక్తదాన శిబిరం

మలికిపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మహేష్‌బాబు 50వ పుట్టినరోజును పురస్కరించుకుని శుక్రవారం వివేకానంద పాఠశాలలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో జి.శ్రీనివాసరావు, నేతల శ్రీనివాస్, ముకేష్ జానీ, చింటూ తదితరులు పాల్గొన్నారు.

పలువురికి కానిస్టేబుల్ ఉద్యోగాలు



గౌతమ్, భాగ్యలక్ష్మి, శాంతిశ్రీ

ఉప్పలగుప్తం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): అల్లవరం మండలానికి చెందిన మోకా సత్తిబాబు ప్రస్తుతం ఎస్సీ హోదాలో ఉన్నారు. ఆయన ఆధ్వర్యంలో కోనసీమలో 20 మందికి స్వంత ఖర్చులతో ఉచితంగా కానిస్టేబుల్ ఉద్యోగాలకు శిక్షణ ఇప్పించారు. శుక్రవారం వెలువడిన ఫలితాల్లో వీరిలో ఏడుగురు కానిస్టేబుళ్లుగా ఎంపికయ్యారు. వీరిలో ముగ్గురు ఉప్పలగుప్తం మండలానికి చెందిన వారు కాగా శుక్రవారం జరిగిన కార్యక్రమంలో కానిస్టేబుళ్లుగా ఎంపికైన జంగా గౌతమ్(చల్లపల్లి), అంబటి భాగ్యలక్ష్మి(గోపవరం), జనిపల్లి శాంతిశ్రీ ఎస్సీ సత్తిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గోసంగి బంగార్రాజు, గూటమ్ సాయి, పరమట నాని, మాకే సిద్ధు, దాసరి సత్తిబాబు, శాంతిరాజు, దాసరి స్వామి, పినిపే వరప్రసాద్ , సూరిబాబు పాల్గొన్నారు.



ప్రశాంత్ ప్రియమల్లిక మణికుమార్ మురళీ

అంబాజీపేట, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసిన ఫలితాల్లో పలువురు కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మండలంలోని పసుపల్లికి చెందిన పెట్టా మురళీ, గంగలకుర్రు అగ్రహారానికి చెందిన రాయుడు మణికుమార్, ఇసుకపూడి, అయినవిల్లి మండలం నేదునూరుకు చెందిన తీడ ప్రియమల్లిక, పులిదిండి ప్రశాంత్ ఎంపికయ్యారు. వీర్ని ఆయా గ్రామాల్లో స్థానికులు అభినందనలు తెలియజేసి సత్కరించారు.

బీబీ సకీనాకు ఘన నివాళి

మామిడికుదురు, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): మహ్మద్ ప్రవక్త మనుమడు, హజరత్‌ఇమామ్ ఇమామ్ హుస్సేన్ తనయురాలైన బీబీ సకీనాకు ముస్లిం‌లు శుక్రవారం ఘన నివాళులర్పించారు. బీబీ సకీనా వర్ధంతిని నగరం, మామిడికుదురులో నిర్వహించారు. ఈసందర్భంగా బీబీ సకీనా పంజా నుంచి పీరును తీసి గుర్రంపై పెదపంజీష వరకు రక్తం చిందేలా మాతం నిర్వహిస్తూ ఊరేగింపు చేశారు. నగరం, మామిడికుదురు పురవీధుల్లో పీరును భక్తులు దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. మత ప్రబోధకుడు అతీస్‌మహ్మద్‌రజా మజ్లిస్ ఆలపించారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు భక్తబృందాలు అన్నసమారాధన నిర్వహించారు.

అయ్యప్పస్వామి ఆలయంలో శాంతి హోమం

మలికిపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మలికిపురం ఎత్తువంతెన వద్ద వేంచేసి ఉన్న హరిహరసుత అయ్యప్పస్వామి ఆలయంలో శుక్రవారం అప్పోలు ఉమామహేశ్వరశర్మ ఆధ్వర్యంలో శాంతి హోమం నిర్వహించారు. ఆలయ ప్రతిష్ఠ జరిగి 101రోజులైన సందర్భంగా హోమం నిర్వహించారు. మధ్యాహ్నం నుంచి సామూహిక కుంకుమార్చన జరిపారు. హోమం, పూజా కార్యక్రమాల్లో ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ పాల్గొని అయ్యప్పస్వామిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త గుండుబోగుల పెదకాపు, అధికారులు పాల్గొన్నారు. గూడపల్లిలో శ్రావణ శుక్రవారం సందర్భంగా నూకాలమ్మ ఆలయం వద్ద సామూహికంగా వరలక్ష్మీవ్రత పూజలు నిర్వహించారు.

నిమ్మకాయల అలంకరణలో మావుళ్ళమ్మ



కాట్రేనికోన, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శుక్రవారం కాట్రేనికోన మావుళ్ళమ్మను నిమ్మకాయలతో అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తుల అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకుడు ఆణివిళ్ళ ఫణికాంత్‌శాస్త్రి ఆధ్వర్యంలో సహస్ర కుంకుమార్చన జరిగింది. ఈకార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి నాగిడి నాగేశ్వరరావు, ఆలయ అధ్యక్షుడు ఆణివిళ్ళ సాయిబాబా, రామకృష్ణపరమహంస, గ్రంధి రాంప్రసాద్, పవన్‌కుమార్, శ్రీకాంత్, కిరణ్, సంసాని వరప్రసాద్, గ్రంధి సత్తిబాబు, చెరుకు బాపిరాజు, చెరుకు కృష్ణ, దొమ్మేటి ఫణీంద్ర, తాతపూడి గోపి, యల్లమిల్లి రమేష్, రెడ్డి రత్నప్రసాద్, గ్రంధి వీరవెంకటసుబ్రహ్మణ్యం దంపతులు, దొంగ ఉదయవెంకటరమణ పాల్గొన్నారు.

అమ్మవారికి గాజులతో అలంకరణ



మామిడికుదురు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని నగరం గ్రామదేవత దొడ్డి గంగాలమ్మవారిని గాజులతో విశేషంగా అలంకరించారు. సౌభాగ్యానికి ప్రతీకగా భావించే వివిధ రంగుల గాజులను దండలుగా చేసి అమ్మవారి మెడలో అలంకరించారు. ఈసందర్భంగా ఆలయంలో కుంకుమార్చనలు నిర్వహించి ప్రత్యేక పూజలు జరిపారు. గాజుల అంకరణలోని అమ్మవారిని భక్తులు దర్శించుకుని పూజలు చేశారు. పలువురు భక్తులు అమ్మవారికి ముడుపులు, మొక్కులు చెల్లించారు.

డెంగ్యూ, మలేరియాపై అవగాహన

ఉప్పలగుప్తం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): దోమలకు ఆశ్రయమిస్తే ఆరోగ్యానికి పెనుముప్పు తప్పదని జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఆయన సన్నవిల్లిలో పర్యటించి దోమల ఆవాస ప్రాంతాలను పరిశీలించారు. నిల్వనీటిలో దోమల లార్వాను గుర్తించి, నివారణ చర్యలపై మహిళలకు అవగాహన కల్పించారు. డెంగ్యూ, మలేరియా, ఫైలేరియా వ్యాధులకు కారణమైన దోమల నివారణకు తీసుకోవలసిన చర్యలు వివరించారు. ఉప్పలగుప్తం పీహెచ్‌సీ వైద్యాధికారి లంకే నాగార్జున ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ జి.నరసింహమూర్తి, సబ్ యూనిట్ ఆఫీసర్ పీఎస్ రాజ్‌కుమార్, హెచ్‌వీ జి.కమల, ఎంపీహెచ్‌ఏ డి.నాగేశ్వరరావు, ఎంఎల్‌హెచ్‌పీ రిజ్వానా, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన దాసరాజు సుధాకర్ కుటుంబ సభ్యులు మురమళ్ళ వీరేశ్వర అన్నదాన ట్రస్టుకు రూ.10,000 విరాళాన్ని శుక్రవారం ఆలయ స్వస్తి వాచకుడు నాగాభట్ల రవిప్రసాద్‌శర్మకు అందించారు. దాత కుటుంబ సభ్యులకు ప్రత్యేక దర్శనం కల్పించి, స్వామి చిత్రపటం, ప్రసాదంతో సత్కరించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ దాతను అభినందించారు.

పరామర్శ

కాట్రేనికోన, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మాతృ వియోగంతో బాధపడుతున్న డీసీ చైర్మన్, టీడీపీ నాయకుడు ఆకాశం శ్రీనివాస్‌ను శుక్రవారం వివిధ పార్టీల నాయకులు, అధికారులు పరామర్శించారు. పరామర్శించిన వారిలో ముమ్మిడివరం ఏఎంసీ చైర్మన్ ఓగూరి భాగ్యశ్రీ, సర్పంచ్ రంబాల రమేష్, సొసైటీ చైర్మన్ నూకల మూర్తి, మండల జనసేన అధ్యక్షుడు మోకా బాలప్రసాద్, నూకల దుర్గబాబు, గిడ్డి రత్నశ్రీ తదితరులున్నారు.




ఆత్రేయపురం: తాడిపూడిలో వృద్ధులకు పింఛన్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బండారు సత్యానందరావు,
మండపేటలో పింఛన్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

విద్యుత్ సరఫరాకు అంతరాయం

కొత్తపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ముక్కామల, మోడేకుర్రు ఫీడర్ల ఆర్‌డీఎస్ఎస్ పనుల నిమిత్తం కొత్తపేట మండలం మోడేకుర్రు, రాకూర్తివారిపాలెం, గొలకోటివారిపాలెం గ్రామాలకు 6, 8, 14, 20, 21, 23, 26వ తేదీల్లో విద్యుత్ సరఫరాను ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ నిలిపివేస్తున్నట్లు విద్యుత్ వినియోగదారులు సహకరించాలని ఈఈ కె.రాంబాబు కోరారు.

అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు

● పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేలు వేగుళ్ల, బండారు

మండపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ పథకాలు, పింఛన్లు అందించటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని స్థానిక ఎమ్మెల్యే రాష్ట్ర అంచనాల కమిటీ ఛైర్మన్ వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. ఎన్నికల ముందు తమ కూటమి పార్టీలు ఇచ్చిన హామీమేరకు ఓకేసారి పింఛన్ వెయ్యి పెంచి రూ.4వేలు చేసిన ఘనత తమదేనన్నారు. ఐదేళ్లపాటు కేవలం వైసీపీ ప్రభుత్వం పెంచిన పింఛన్ వెయ్యి మాత్రమేనని ఆయన ఎద్దేవా చేశారు. సంక్షేమ పథకాలు అభివృద్ధిలో ఏపీని అగ్రగామిగా నిలిపేందుకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్, ఐటీ మంత్రి నారాలోకేష్‌లు కృషి చేస్తున్నారన్నారు. పట్టణంలో నూతనంగా మంజూరైన పింఛన్‌లు శుక్రవారం వేకువజామున మున్సిపల్ అధికారులు, పార్టీ నాయకులతో కలిసి ఆయన పంపిణీ చేశారు. వార్డులతోపాటు మండపేట రూరల్ గ్రామాల్లో నూతన పింఛన్‌లను కూటమినేతలు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో మాజీ మున్సిపల్ ఛైర్మన్ చుండ్రు శ్రీవరప్రకాష్, మల్లిపూడి గణేష్, వాధా ప్రసాదరావు, కె.అప్పన్న బాబు, శెట్టి రవి, సంకు మాధవి, కమిషనర్ టీ.వి. రంగారావు సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధి కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఆత్రేయపురం: కూటమి పాలనలో అభివృద్ధి సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు పేర్కొన్నారు. శుక్రవారం ఆత్రేయపురం మండలం తాడిపూడిలో ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కొత్తపేట నియోజకవర్గం నుంచి నాలుగు మండలాల నుంచి 42,522 మందికి పింఛన్లు అందిస్తున్నామన్నారు. ప్రస్తుతం నూతనంగా 763మందికి స్పౌజ్ పింఛన్లు అందిస్తు పేదల జీవితాలకు భద్రత కల్పిస్తున్నామని పేర్కొన్నారు. మండల టీడీపీ అధ్యక్షుడు ముదునూరి వెంకట్రాజు, సెంట్రల్ డెల్టా ప్రాజెక్టు కమిటీ వైస్ ఛైర్మన్ కరుటూరి నరసింహరావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, ముళ్ళపూడి భాస్కరరావు, ఎంపీడీవో వెంకటరామన్,నాయకులు పాల్గొన్నారు.

పింఛన్లతో పేదలకు భరోసా

ద్రాక్షారామ: ఎన్టీఆర్ భరోసా సంక్షేమ పింఛన్లతో పేదలకు భరోసా కలుగుతుందని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. శుక్రవారం మండలంలోని నెలపర్తిపాడు, చప్పిడివారి సావరంలో నూతనంగా మంజూరైన పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామచంద్రపురం నియోజక వర్గంలో కొత్తగా మంజూరైన స్పౌజ్ పింఛన్లతో లబ్ధిదారులు ఆనందంగా ఉన్నారని అన్నారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, ఎంపీడీవో పద్మజ్యోతి, సచివాలయ సిబ్బంది, కూటమి నాయకులు పాల్గొన్నారు.

కె.గంగవరం:నిరుపేదల కుటుంబాల్లో ఆసరాగా ఎన్టీఆర్ భరోసా పింఛన్లు నిలుస్తున్నాయని, పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందని టీడీపీ సీనియర్ నాయకుడు వాసంశెట్టి సత్యం అన్నారు. శుక్రవారం కుందూరు, యర్రపోతవరం గ్రామాల్లో నూతనంగా మంజూరైన పింఛన్లు ఆయన పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎన్.శ్రీనివాసు, ఎంపీపీ పంపన నాగమణి, సొసైటీ ఛైర్మన్ జగతా రమణ, కూటమి నాయకులు మేడిశెట్టి బాబి, చిర్రా సురేష్, పళ్ల చినబాబు, కట్టా నాగేశ్వరరావు, సాపిరెడ్డి విశ్వనాథబాలాజీ, రాయపురెడ్డి విశ్వేశ్వర సీతారామయ్య, యర్రపోతవరం సర్పంచ్ పిల్లి రాంబాబు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



రాయవరంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న ఎంపీడీవో కీర్తి స్పందన



ఆలమూరులో కొత్త పింఛన్లు పంపిణీ చేస్తున్న నాయకులు



రామచంద్రపురంలో పింఛన్లు పంపిణీ చేస్తున్న వాసంశెట్టి సత్యం

92శాతం సామాజిక పింఛన్లు పంపిణీ

రాయవరం: మండలంలోని 12 గ్రామాల పరిధిలో శుక్రవారం సామాజిక పింఛన్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మండలంలో 10వేల 31మంది వివిధ రకాల పింఛన్‌దారులు ఉండగా 9వేల 214 మందికి పింఛన్లు పంపిణీ చేసినట్లు ఎంపీడీవో ఎన్.కీర్తి స్పందన తెలిపారు. మండలంలో పింఛన్ పొందుతూ మరణించిన యజమాని భార్యలకు 156 మందికి స్పౌజ్ పింఛన్లు మంజూరుకాగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాయవరంలో ఎంపీడీవో చేతులమీదుగా పింఛన్లు పంపిణీ చేశారు.

ఆలమూరులో 192 కొత్త పింఛన్లు పంపిణీ

ఆలమూరు: ఆలమూరు మండలంలో కొత్తగా మంజూరైన 192 పింఛన్లుతోపాటు గతంలో ఉన్న పింఛన్లు పంపిణీ కార్యక్రమం గ్రామాలలో ఇంటింటికీ వెళ్లి నాయకుల సమక్షంలో అధికారులు లబ్ధిదారులకు అందజేశారు. మండలంలో ఎంపీడీవో ఎ.రాజు, టీడీపీ మండల అధ్యక్షుడు ఈదల సత్తిబాబు, కార్యదర్శి సలాది నాగేశ్వరరావు, వంటిపల్లి సతీష్‌కుమార్, ఈదల నల్లబాబు, కేతా రాంబాబు, మెర్ల గోపాలస్వామి, అముజూరి శ్రీనివాస్, తోట వెంకటేశ్వర్లు, సంగిత సుబాష్ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

రావులపాలెం: ప్రభుత్వం కొత్తగా మంజూరు చేసిన పింఛన్లను కూటమినేతలు పంపిణీ చేశారు. రావులపాలెం మండలంలోని గ్రామాల్లో ఎమ్మెల్యే సత్యానందరావు సూచనల మేరకు కూటమి నాయకులు నూతనంగా మంజూరు చేసిన పింఛన్లను లబ్ధిదారులకు అందజేశారు. గోపాలపురంలో రాష్ట్ర తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి అనపర్తి నియోజకవర్గ పరిశీలకుడు ఆకుల రామకృష్ణ స్థానిక నాయకులతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు.

కొత్తపేట: నూతనంగా మంజూరైన వితంతు పింఛన్లను శుక్రవారం కూటమి నేతలు లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలూరి సత్యానందం, సర్పంచ్ బూసి జయలక్ష్మిభాస్కరరావు, కంఠంశెట్టి శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ విళ్ల మారుతీప్రసాద్, ప్రభాకర్ పాల్గొన్నారు.



కొత్తపేటలో పింఛన్లను పంపిణీ చేస్తున్న కూటమి నేతలు

కానిస్టేబుల్‌గా ఎంపికైన బడుగువానిలంక కుర్రోడు



విజయ్ మణికంఠ

ఆలమూరు, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని బడుగువానిలంక గ్రామానికి చెందిన రైతు పాలూరి శ్రీను ఆయన కుమారుడు పాలూరి విజయ్‌మణికంఠ శుక్రవారం విడుదల చేసిన కానిస్టేబుల్ ఫలితాలలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు. విజయ్‌మణికంఠ చొప్పెల్ల, చెముడులంక హైస్కూల్‌లో పదో తరగతి వరకు చదువుకున్నాడు. తదుపరి ఐటీఐకి వెళ్లి పూర్తి చేసినప్పటికీ తగినంత అవకాశాలు రాకపోవడంతో తండ్రితోపాటు వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఉద్యోగ ప్రయత్నం చేయమని పలువురు చెప్పడంతో ఇంటర్, డిగ్రీ పూర్తి చేశారు. 2018 నుంచి ఉద్యోగం కోసం చేసిన ప్రయత్నంలో రైల్వేలో 2022లో ఉద్యోగం దగ్గరకు వచ్చి పోయింది. కానిస్టేబుల్స్‌కు నోటిఫికేషన్ విడుదల కావడంతో ఆ ఉద్యోగంకోసం తీవ్రంగా శ్రమించాడు. దీంతో శుక్రవారం విడుదలైన ఫలితాలలో కానిస్టేబుల్‌గా ఎంపికయ్యారు.

ఎస్టీయూ అధ్యక్షుడిగా సలాది



సలాది శ్రీనివాస్

ఆలమూరు, ఆగస్టు 1(ఆంధ్ర జ్యోతి): ఆల మూరు మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా జొన్నాడ జెడ్పీ హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సలాది శ్రీనివాస్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ఎస్టీయూ అధ్యక్షుడిగా ఉన్న ఎస్వీ వంశీకృష్ణ ఇటీవల మండలం నుంచి బదిలీ కావడంతో ఆయన స్థానంలో సలాది శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల ప్రధాన కార్యదర్శిగా వీఎస్‌వీ దుర్గాప్రసాద్ మహిళా అధ్యక్షురాలిగా పి.శ్రావణి కొనసాగుతున్నారు. నూతన అధ్యక్షుడు శ్రీనివాస్‌ను పలువురు ఉపాధ్యాయులు అభినందించారు.

లివరీ దుప్పట్లు మజూరీ పెంపుపై హర్షం

ద్రాక్షారామ, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర చేనేత జౌళీ శాఖా మాత్యులు సవిత ఇచ్చిన హామీ మేరకు లివరీ దుప్పట్ల మంజూరీ రూ.100లకు పెంచడంపై లివరీ చేనేత సహకార సంఘాల ఫెడరేషన్ ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఛైర్మన్ దొంతంశెట్టి సత్యప్రకాష్ హర్షం ప్రకటించారు. ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ఈపెంపు నిర్ణయంతో ఒక్కో చేనేత కుటుంబానికి నెలకు రూ.2నుంచి 3వేలు ఆదాయం పెరుగుతుందని ఆయన పేర్కొన్నారు. తమ సమస్యలు పరిష్కారానికి కృషి చేసిన కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు అన్నదాత సుఖీభవ సాయం పంపిణీ

మండపేట, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ పథకంలో భాగంగా తొలివిడత రాష్ట్రప్రభుత్వం అందించే రూ.5000ను సీఎం చంద్రబాబు నాయుడు ప్రకాశం జిల్లా దర్శిలోను ప్రధాన మంత్రి నరేంద్రమోదీ కేంద్రసాయం రూ.2000ను వారణాసి నుంచి శనివారం రైతుల ఖాతాలకు విడుదల చేస్తారని మండపేట మండల వ్యవసాయాధికారి ప్రభాకరరావు తెలిపారు,. మండపేట పట్టణంలోని సీతారామ కల్యాణ మండపంలో శనివారం రైతులకు స్థానిక ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశరరావు నియోజకవర్గస్థాయిలో అన్నదాత సుఖీభవ కార్యక్రమం జరుగుతుందని, రైతులంతా కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు.

రేపు అమలాపురంలో ఆటో యూనియన్ సమావేశం

మండపేట, ఆగస్టు1 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 15నుంచి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం ప్రారంభిస్తున్న నేపథ్యంలో ఆటో కార్మికులు జీవనస్థితి అగమ్యం అవుతుందని ఆటో కార్మికులు ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం నిర్ణయం నేపథ్యంలో ఆటో వాలాలు ఈనెల 3న అమలాపురంలో జిల్లాస్థాయి ఆటో కార్మికుల సమావేశం నిర్వహిస్తామని రామచంద్రపురం డివిజన్‌కు చెందిన ఐదు ఆటో యూనియన్ నాయకులు తెలిపారు. మండపేట పట్టణంలో శుక్రవారం జరిగిన ఆటో యూనియన్ సమావేశం మండపేట ఏడిద రోడ్డులో జరిగింది. సమావేశానికి ఆంధ్రా ఆటోవాలా ఆటోవర్కర్స్ రామచంద్రపురం డివిజన్ అధ్యక్షుడు పి.సుకుమార్‌బాబు అధ్యక్షత వహించారు. సమావేశంలో పాల్గొన్న కార్మికులు ఆటోయూనియన్ నాయకులు పలు అంశాలపై చర్చించారు. ఎం.అధినారాయణ, ఉండ్రాజవరపు రవి, సన్నాల ధన రాజు, సాహశ్రీచ్, టేకుమూడి శ్రీను, కందుల శ్రీను, మోషే, చంద్రం, శ్రీను, రాజు,వై.రాజు పాల్గొన్నారు.

బెల్ట్‌షాపు అమ్మకాలను అడ్డుకున్న వైసీపీ నాయకులు

ఆత్రేయపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్‌షాపులు ఎక్కడపడితే అక్కడ మద్యం అమ్మకాలు అధిక రేట్లకు విచ్చలవిడిగా సాగిస్తున్నారని వైసీపీ శ్రేణులు మండిపడ్డారు. శుక్రవారం జిల్లా వైసీపీ అధికార ప్రతినిధి కప్పల శ్రీధర్, ఎంపీపీ కుండా అన్నపూర్ణ, జడ్పీటీసీ బోనం సాయిబాబా తదితరులు బెల్ట్‌షాపు అమ్మకాలను పరిశీలించి అడ్డుకున్నారు.



కపిలేశ్వరపురంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రత్నకుమారి




మండపేట మండలం ద్వారపూడిలో, ఆలమూరు మండలం పినపళ్లలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్ సిబ్బంది

తల్లి పాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం

● తల్లిపాల వారోత్సవాల్లో పాల్గొన్న అధికారులు

కపిలేశ్వరపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): తల్లిపాలతోనే బిడ్డకు సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.రత్నకుమారి, ఐ.మాణిక్యంలు అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాలు ప్రారంభోత్సవంలో భాగంగా శుక్రవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు మండపేట పరిధిలోని కపిలేశ్వరపురం మండలంలోని టేకి, కపిలేశ్వరపురం గ్రామాల్లో ప్రాజెక్టు అధికారిణి ఎ.గజలక్ష్మి ఆదేశాల మేరకు నిర్వహించిన కార్యక్రమాల్లో వారు పాల్గొని మాట్లాడారు. తల్లిపాలకు మద్దతునిచ్చే స్థిరమైన వ్యవస్థలను ఏర్పాటుచేసి తల్లిపాల సంస్కృతి ప్రోత్సాహానికి ప్రాధాన్యం ఇద్దాం అనే నినాదంతో ఈనెల 7వరకు ఈ తల్లిపాల వారోత్సవాలను ప్రతీ అంగన్‌వాడీ కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో తల్లులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

మండపేట: మండలంలోని ద్వారపూడిలో శుక్రవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ ఉద్యోగులు తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. తల్లిపాల ప్రాధాన్యతను వివరిస్తూ ప్రజలకు అవగాహన కల్పించారు. తల్లిపాలలో బిడ్డకు అవసరమైన పోషకాలు ఉంటాయని హెల్త్ అధికారిణి విజయకుమారి అన్నారు. తల్లి బిడ్డకు పాలు ఇవ్వటంవల్ల తల్లికి గర్భాశయం త్వరగా సాధా రణస్థితికి వస్తుందన్నారు. కార్యక్రమంలో లోవరాజు మంగాయమ్మ, మాణిక్యాలరావు, ఆశా సిబ్బంది బాలింతలు, మహిళలు పాల్గొన్నారు.

అవగాహన ర్యాలీలు

ఆలమూరు: తల్లిపాల విశిష్టతను ప్రతీ తల్లి గుర్తించి బిడ్డలకు తల్లిపాలను సక్రమంగా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నాగలక్ష్మి సూచించారు. ఆగస్టు 1నుంచి వారం రోజులపాటు తల్లిపాల వారోత్సవాలలో భాగంగా శుక్రవారం ఆలమూరు మండలం పినపళ్లలో తల్లిపాల విశిష్టతను తెలియజేస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలు దోహదం

రాయవరం: బిడ్డ శారీరక, మానసిక ఎదుగుదలకు తల్లిపాలు దోహదపడతాయని ఐసీడీఎస్ చెల్లూరు సెక్టార్ సూపర్‌వైజర్ బి.ఈశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని చెల్లూరు గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తల ఆధ్వర్యం లో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈకార్యక్రమంలో పాల్గొన్న సూపర్‌వైజర్ మాట్లాడుతూ శిశువు పుట్టినదగ్గర నుంచి రెండేళ్ల వయస్సు వచ్చే వరకు తల్లిపాలు పట్టించాలన్నారు. తల్లిపాలవల్ల బిడ్డకు ఏవిధమైన ప్రయోజనాలు వివరిస్తూ గ్రామంలో అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఈకార్యక్రమంలో చెల్లూరు సెక్టార్ యూనియన్ లీడర్ కమల, తల్లులు పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠం

కొత్తపేట: తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేష్ఠమని ఆరు నెలలవరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని అవిడి పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శ్రీవిద్య అన్నారు. శుక్రవారం అవిడి గ్రామంలో అంగన్‌వాడీకేంద్రంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలను పురస్కరించుకుని తల్లులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కె.చంద్రకళ మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టాలని రెండేళ్ల వరకు అనుబంధ ఆహారాలతో పాటు తల్లిపాలు కొనసాగించాలని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎం.ఆదిలక్ష్మి, జి.రమణ, జి.నాగలక్ష్మి, కె.సూర్యరత్నం తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శ్రావణ శుక్రవారం పూజలు



ప్రత్యేక అలంకరణలో విజయదుర్గా అమ్మవారు



పసుపుకొమ్ముల అలంకరణలో రాయవరం పార్వతి అమ్మవారు.



అమ్మవారికి మామిడికాయలతో విశేష అలంకరణ



పూర్ణాలంకరణలో ఈతకోట కనకదుర్గమ్మ అమ్మవారు

రాయవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెదురుపాక విజయదుర్గా పీఠంలో శ్రావణమాసం రెండో శుక్రవారం పూజలు విజయదుర్గా అమ్మవారికి వైభవంగా నిర్వహించారు. పీఠం అడ్మినిస్ట్రేటర్ వీవీ బాపిరాజు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో విజయదుర్గా అమ్మవారికి వివిధ రకాల ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించి అమ్మవారికి దుర్గా అష్టోత్తర, సహస్ర నామాలతో మహిళలచే సామూహిక కుంకుమార్చనలు చేశారు. అధికసంఖ్యలో మహిళలు సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులు పీఠాధిపతి గాడ్ ఆశీస్సులు పొందారు. విజయదుర్గా సేవాసమితి ఆధ్వర్యంలో భారీ అన్న సమారాధన జరిపారు. విజయదుర్గా సేవాసమితి ప్రతినిధులు గాదే భాస్కరనారాయణ, సత్యవెంకట కామేశ్వరి, బి.రమ, పెదపాటి సత్యకనకదుర్గ, బుజ్జి, పీఆర్వో బాబి భక్తులు పాల్గొన్నారు.

పసుపు కొమ్ముల అలంకరణలో పార్వతి అమ్మవారు

శ్రావణమాసం రెండో శుక్రవారం పురస్కరించుకుని రాయవరం పార్వతి సమేత రాజరాజేశ్వరిస్వామి ఆలయంలో స్వామివారికి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. ఆలయ అర్చకులు విలపర్తి ఫణిధరశర్మ, శశిధరశర్మ ఆధ్వర్యంలో స్వామివారికి అమ్మవారికి అర్చనలు నిర్వహించారు. అనంతరం పసుపు కొమ్ములతో పార్వతి అమ్మవారికి ప్రత్యేకంగా అలంకరించారు. రాయవరం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మామిడికాయలతో విశేష అలంకరణ

ఆత్రేయపురం: ఆత్రేయపురం శ్రీలక్ష్మివేంకటేశ్వరస్వామి ఆలయంలో శ్రావణమాసం రెండవ శుక్రవారం శ్రీలక్ష్మిదేవి అమ్మవారికి మామిడికాయలతో ప్రత్యేక అలంకరణ చేశారు. అనంతరం మహిళలచే సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు వాడపల్లి పవనదీక్షితులు, పెద్దింటి రవికృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఛైర్మన్ పాతపాటి వెంకట సత్యనారాయణరాజు ఏర్పాట్లు చేపట్టారు.

భక్తిశ్రద్ధలతో శ్రావణ శుక్రవారం

కపిలేశ్వరపురం: శ్రావణమాసం రెండవ శుక్రవారాన్ని మండలంలోని పలుగ్రామాల్లో మహిళలు భక్తిశ్రద్ధలతో ఆచరించారు. ఈసందర్భంగా మహిళలు వేకువజామునే లేచి తలస్నానమాచరించి ఇండ్లగుమ్మాలను మామిడితోరణాలతో అలంకరించి కలశంలో అమ్మవారిని ఏర్పాటు చేసుకుని నైవేద్యాలు సమర్పించి పూజలు నిర్వహించారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు

రావులపాలెం: శ్రావణమాస పర్వదినాలను పురస్కరించుకుని అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈతకోట కనకదుర్గమ్మ అమ్మవారి ఆలయాల్లో ఉదయం అమ్మవారికి కుంకమ పూజలు, అష్టోత్తర సహస్రనామ పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న అమ్మవారి ఆలయాల్లో ప్రత్యేక పూజలు, అలంకరణలు నిర్వహించారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి ముడి వెండి విరాళం

రాయవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): రాయవరం శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి ఆలయానికి దాత వితరణతో ముడి వెండి విరాళంగా అందజేశారు. స్వామివారికి మకరతోరణం తయారీ కోసం గ్రామానికి చెందిన దుర్గపు వెంకన్నబాబు, సత్య రత్నకుమారి దంపతులు, కుటుంబ సభ్యులు వితరణతో రూ.1లక్ష1వేల రూపాయల విలువైన వెండిని ఆలయానికి అందజేశారు. కార్యక్రమంలో గ్రామాభివృద్ధి కమిటీ ఛైర్మన్ ఉండవిల్లి రాంబాబు, వల్లూరి శ్రీనివాస చౌదరి, ఆలయ అర్చకుడు పెద్దింటి కృష్ణమాచార్యులు, పులగం శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



రాయవరం వేంకటేశ్వరస్వామి ఆలయానికి వెండి అందజేస్తున్న దాతలు

'ఛలో విజయవాడను విజయవంతం చేయాలి'

రాయవరం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డును పునరుద్ధరించాలని, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సెప్టెంబరు 15న నిర్వహించే ఛలో విజయవాడను విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని చెల్లూరు గ్రామంలో శ్రీభక్తాంజనేయ భవన నిర్మాణ కార్మికుల సంఘం మండల స్థాయి సమావేశం నిర్వహించారు. సంఘం మండలాధ్యక్షుడు కర్రి తాతారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్, మండల కన్వీనర్ డి.ఆదిలక్ష్మి తదితరులు మాట్లాడుతూ వచ్చేనెల 15న రాష్ట్ర లేబర్ కమీషన్ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని కార్మికులంతా విజయవంతం చేయాలన్నారు. కార్మికుల సమస్యలపై చర్చించారు. టి.వెంకటరామారెడ్డి, బి.దుర్గాప్రసాద్, గండ్రి చంద్రశేఖర్, లంక వెంకట్రాజు, లంక చందు, దివాకర్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

మైనార్టీ విద్యా సంస్థల్లో అన్యమతస్తుల నియామకాన్ని నిలిపివేయాలి

● పీడీఎస్‌యూ నాయకుడు సిద్ధూ

ద్రాక్షారామ, ఆగస్టు1(ఆంధ్రజ్యోతి): 125 ఏళ్ల చారిత్రక ప్రస్థానంగల సీబీసీఎస్ సీయూపీ పాఠశాలలు మైనార్టీల మతపరమైన సాంస్కృతిక స్వాతంత్ర్య కేంద్రాలుగా నిలుస్తున్న తరుణంలో ఆ పాఠశాలల నిర్వహణలో మతేతరులను కరస్పాండెంట్‌గా నియమించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి బి.సిద్ధూ అన్నారు. శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. దీనిపై పాఠశాల విద్యార్థులతో కలిసి పీడీఎస్‌యూ నాయకులు నిరసన వ్యక్తం చేశారు. మైనార్టీ యాజమాన్యాలకు పరిపూర్ణ పరిపాలనా స్వాతంత్ర్యం కల్పించాలి, ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులు భర్తీచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు నవీన్, లంక విశిత, మందపల్లి టోనీలత, లంక సురేంద్ర, రూప, శివ, అజయ్ పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి నిరసన తెలియజేస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

ప్రజలు ఛీకొట్టినా వైసీపీ నేతలకు బుద్ధి రాలేదు

● ఎమ్మెల్యే బండారు సత్యానందరావు

ఆత్రేయపురం, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): ప్రజలు ఛీకొట్టి తరిమి వేసినా వైసీపీ నాయకులకు బుద్ధి రావడంలేదని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు మండిపడ్డారు. శుక్రవారం తాడిపూడిలో టీడీపీ కార్యాలయాన్ని ప్రారంభించి సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతిపక్ష నేతల ఆరోపణలు ఆయన తిప్పికొట్టారు. ఒక్కచాన్స్ అంటూ అధికారంలోకి వచ్చి రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిన మాజీ సీఎం జగన్ అవినీతి కేసుల్లో జైలుకు వెళ్లడం ఖాయమన్నారు. త్వరలోనే వైసీపీ కాలగర్భంలో కలిసిపోతుందన్నారు. వైసీపీ నేతల మాయమాటలు ప్రజలు నమ్మే రోజులు పోయాయన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు కూసంపూడి రామకృష్ణంరాజు, జిల్లా టీడీపీ అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, మాజీ సమితి అధ్యక్షుడు మద్దూరి సుబ్బారావు, క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు ముదునూరి వెంకట్రాజు, కరుటూరి నరసింహరావు, ముళ్ళపూడి భాస్కరరావు, మండల పార్టీ ప్రధాన కార్యదర్శి గుడేలా నాగేంద్ర, తోటకూర సుబ్బరాజు, ముదునూరి వీరబాబు, జుజ్జువరపు హరిబాబు, మాజీ ఎంపీపీ పీఎస్ రాజులు కూటమి పార్టీ నేతలు పాల్గొన్నారు.



తాడిపూడిలో కరపత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే సత్యానందరావు

వెలగతోడు ప్రభుత్వ పాఠశాలకు మరమ్మతులు

● హెచ్ఎం శ్రీనివాసరావుకు సత్కారం

మండపేట, ఆగస్టు 1(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలగ తోడు జిల్లా పరిషత్ హైస్కూల్‌కు రంగులు వెలసిపోయి పాడైపోయింది. దీంతో హెచ్ఎంగా పనిచేస్తున్న శ్రీనివాసరావు తమ పాఠశాలకు రంగులు వెలసి పోయాయని మరమ్మతులు చేయాలని ప్రభుత్వానికి నివేదించినా నిధులు రాలేదు. దీంతో ఆ పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పనిచేస్తున్న శ్రీనివాసరావు తన సొంత నిధులు లక్షకుపైగా రూపాయలతో మరమ్మతులు చేయించి రంగులు వేయించి అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు. దీంతో హెచ్ఎం శ్రీనివాసరావును సహచర ఉపాధ్యాయులు అభినందించారు. ఈపాఠశాలలో సుమారు 200మంది వరకు విద్యార్థులు చదువుకుంటున్నారు. సహచర ఉపాధ్యాయులు శ్రీనివాసరావును సత్కరించారు.



శ్రీనివాసరావును సత్కరిస్తున్న సహచర ఉపాధ్యాయులు